
ట్రాన్స్‌ఫార్మర్ల కష్టాలు

డిపాజిట్ కట్టి నెలలవుతున్నా అందని ట్రాన్స్‌ఫార్మర్లు


విద్యుత్ కనెక్షన్ లేని బోరుబావి

ఆరునెలలుగా అధికారుల చుట్టు తిరుగుతున్నా



బోరు వేసి నీరు పడ్డాక, డిపాజిట్ చెల్లించి గత ఆరునెలలుగా విద్యుత్ కనెక్షన్‌కోసం ఎదురు చూస్తున్నా. విద్యుత్ సౌకర్యముంటే ఇప్పటికే ఓ పంట చేతికొచ్చేంది. అధికారులను ఎన్నిమార్లు అడిగినా పైనుంచి విద్యుత్ పరికరాలు రాలేదనే సమాధానం చెబుతున్నారు. డిపాజిట్లు చెల్లించినా, విద్యుత్ సౌకర్యం కల్పించాలేరా? వెంటనే విద్యుత్ సౌకర్యం కల్పించాలి.

- విశ్వనాథ్‌రెడ్డి, రైతు, మబ్బువారిపల్లి



డిపాజిట్లు చెల్లించి ట్రాన్స్‌ఫార్మర్ల కోసం రైతులు నెలలుగా ఎదురు చూస్తున్నారు. మండల వ్యాప్తంగా 94మంది రైతులు 46 ట్రాన్స్‌ఫార్మర్ల కోసం డిపాజిట్లు చెల్లించి గత ఆరునెలలుగా ఎదురు చూస్తున్నారు. రూ.లక్షలు వెచ్చించి బోరుబావులు తవ్వుకుని, మోటార్లు, పైపులు కొనుగోలు చేసి, విద్యుత్ కనెక్షన్ కోసం రైతులు విద్యుత్ కార్యాలయాలు చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. విద్యుత్ సౌకర్యం లేక బోరుబావుల్లో నీరున్నా తమ పొలాలను బీళ్లుగా పెట్టాల్సి వస్తోందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది రైతులు తమ సమీప పొలాల రైతులు ఉపయోగిస్తున్న ట్రాన్స్ ఫార్మర్లనుంచి తాత్కాలికంగా విద్యుత్ సౌకర్యం కల్పించుకుని పంటలు సాగుచేశారు. ఈక్రమంలో లో ఓల్టేజీ సమస్య ఏర్పడుతోంది. దీంతో సాగుచేసిన పంటలుకూడా చేతికొచ్చే పరిస్థితి కనిపించడం లేదు. మండలంలోని కోటపల్లి గ్రామంలో ఓ రైతు అండుకొర్రలు మూడు ఎకరాల్లో సాగుచేశాడు. ఓతడి ఇస్తే మొత్తం విత్తనం మొలకెత్తే పరిస్థితి ఉన్నా ఇవ్వలేక అలాగే వదిలేశాడు. ఇలా పల్లెల్లో రైతులు ఇబ్బందుతు పడుతున్నా విద్యుత్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉండటంపై తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. - తనకల్లు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం

మండల వ్యాప్తంగా 94మంది రైతులు ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ సౌకర్యం కోసం డిపాజిట్లు చెల్లించి ఎదురు చూస్తున్న మాట వాస్తవమే. గత ఆరునెలలుగా పైనుంచి ఎలాంటి పరికరాలు అందలేదు. డిపాజిట్లు చెల్లించిన రైతులు ఒత్తిడి చేస్తుండటంతో తాముకూడా ఈసమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుంది. రైతులందరికి శుభవార్త చెబుతాం.

- శ్రీకాంత్, జేఈ, తనకల్లు

కాళ్లు అరిగేలా కార్యాలయం చుట్టూ రైతుల ప్రదక్షిణ
బోరు బావుల్లో నీళ్లున్నా బీళ్లుగా వ్యవసాయ భూములు


పంట సాగు చేయడానికి సిద్ధం చేసుకున్న భూమి


ఉద్యోగం వదిలి వ్యవసాయానికి వచ్చా



బెంగళూరులో చిన్నపాటి ఉద్యోగం చేసుకుంటూ జీవించేవాడిని. వ్యవసాయం మీద మక్కువతో మా తాతలకాలం నుంచి ఉన్న భూమిలో నీరు పడడంతో ఎంతో ఆనందంగా వ్యవసాయం చేద్దామని వచ్చా. ట్రాన్స్‌ఫార్మర్ కోసం ఆన్‌లైన్ లో డిపాజిట్లు చెల్లించినా, విద్యుత్ కనెక్షన్ అందించడంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారు. అధికారులను ఎప్పుడు అడిగినా, ఇంకా ట్రాన్స్‌ఫార్మర్లు రాలేదంటూ కాలం వెల్లదీస్తున్నారు. వెంటనే విద్యుత్ సౌకర్యం కల్పించి రైతులను ఆదుకోవాలి. ఈ సమస్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలి.

- బాబురెడ్డి, ఎనుములవారిపల్లి

సవరించినా తప్పులే !


చనిపోయినా ఓటరు తుది జాబితాలో సిలార్‌సాబ్, నూర్జ మీర్ పేర్లు ఉన్న దృశ్యం

కొత్తచెరువు, జనవరి 27: సవరించినా ఓటరు జాబితాలో తప్పులు దొర్లుతూనే ఉన్నాయి. మండలంలో ఈనెల 22న కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన తుదిజాబితాలో మళ్లీ అవే తప్పులు దొర్లాయి. మండల కేంద్రంలోని 21వ పోలింగ్ కేంద్రంలో సిలార్ సాబ్ అనే వ్యక్తి చనిపోయి 8నెలలు అయిన ఓటరు జాబితాలో ఆయన పేరు అలాగే ఉంచారు. నూర్జమీర్ చనిపోయి ఏడాది కావస్తున్నా ఆమె ఓటును తొలగించకుండా అలాగే ఉంచారు. ఇలాంటివి మండలవ్యాప్తంగా వందల్లో ఉన్నట్టు ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. వీటిని తొలగించాలని అధికారులు, జిల్లా కలెక్టర్ దృష్టికి గతంలోనే తీసుకెళ్లినా ప్రయోజనం శూన్యమని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. గతంలో స్థానికంగా ఉండి ప్రస్తుతం వేరే గ్రామాలకు వెళ్లిన వారి ఓట్లు కూడా తొలగించకుండా అలాగే ఉంచారన్నారు. అధికారపార్టీ సానుభూతిపరుల ఓట్లు రెండు చోట్ల ఉన్నా తొలగించకపోవడం, ప్రతిపక్షాల వారివి తొలగించడం చూస్తుంటే అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లకు అధికారులు తలొగ్గినట్లేనని అర్థమవుతోందని టీడీపీ నాయకులు పేర్కొన్నారు.

విలువలతో కూడిన విద్య అందించాలి

శ్రీ పీఠం పీఠాధిపతి పరిపూర్ణానంద స్వామి


పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో మాట్లాడుతున్న పరిపూర్ణానంద స్వామి


హిందూపురం అర్బన్, జనవరి 27: విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను ప్రతి పాఠశాల అందించాలని శ్రీ పీఠం పీఠాధిపతి పరిపూర్ణానంద స్వామి పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలోని సరస్వతీ విద్యా మందిరాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం శనివారం పట్టణ పరిధిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పరిపూర్ణానంద స్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు సమాజం, మన సంస్కృతి, సంప్రదాయాల పట్ల గౌరవం, విలువలు తెలియజేయాలన్నారు. అప్పుడే వారు దేశం గర్వించదగ్గ వ్యక్తిత్వం ఉన్న పౌరులుగా ఎదుగుతారన్నారు. అలాంటి విలువలతో కూడిన విద్యను సరస్వతీ విద్యా మందిరాలు అందిస్తున్నాయని వివరించారు. అంతకుముందు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. సర్వతీ విద్యా మందిరం 50 సంవత్సరాలు పూర్తి చేసుకొని 51వ ఏట అడుగు పెడుతున్న సందర్భంగా పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు. ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో విద్యాభారతి సంఘటనా మంత్రి కన్నా భాస్కర్, అనంతపురం సమితి కార్యదర్శి పరుచూరి రమేష్, అధ్యక్షుడు గోపాలకృష్ణ, శ్రీసత్యసాయి జిల్లా కార్యదర్శి కె.ఏ రాధాకృష్ణ, వందలాది మంది అధ్యాపకులు వేయి మందికి పైగా పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఇక్కడి నుంచే ఎంపీగా పోటీ చేస్తా

భారతీయ జనతాపార్టీ అధిష్ఠానం అనుమతిస్తే హిందూపురం నుంచి ఎంపీగా పోటీ చేస్తానని శ్రీపీఠం పీఠాధిపతి పరిపూర్ణానంద స్వామి పేర్కొన్నారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సరస్వతీ విద్యాపీఠం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. హిందూపురం నుంచి బీజేపీ తరపున ఎంపీగా పోటీ చేస్తానని పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, అధినాయకులకు, ముఖ్యులకు కూడా తెలిపానన్నారు. హిందూపురంలో నాకు పరిచమయం ఉన్నవారు, కార్యకర్తలు చాలా మందితో ఇదే విషయం మాట్లాడానని తెలిపారు. అందరూ చాల సంతోషంతో ఆహ్వానిస్తున్నారని వెల్లడించారు. హిందూపురం అనే పేరు తన మనస్సును ఎంతో ఆకర్షించింది. ఎందుకంటే హిందువు అనే శబ్దంతో కూడుకున్న పుణ్యభూమి ఇది ఒక్కటే అన్నారు. తాను మొట్టమొదటి రథయాత్ర చేసింది కూడా హిందూపురం నుంచే అని పేర్కొన్నారు. హిందూపురం అంటేనే ఆధ్యాత్మిక క్షేత్రాల నిలయం అని తాను భావిస్తున్నానన్నారు. రాయలసీమ ఒకప్పుడు రతనాల సీమగా పేరు గాంచిందన్నారు. ఆ పూర్వ వైభవం తేవడం కోసమే తాను ఈ ప్రాంతం నుంచి పోటీ చేయనున్నట్లు వివరించారు.

తెలుగు జాబితాలో కన్నడ పేర్లా

ఓటరు జాబితాలో చిత్ర విచిత్రాలు


మృతిచెందిన వారి పేర్లు ఓటరు జాబితాలో ఉన్న దృశ్యం


కన్నడలో అక్షరాలు ఉన్న దృశ్యం


హిందూపురం, జనవరి 27: కేంద్ర ఎన్నికల సంఘం చర్యలు తీసుకున్నా, ముఖ్య అధికారులను పక్కన పెట్టినా తప్పులు అలాగే ఉన్నాయి. తుది ఓటరు జాబితాలో చిత్ర విచిత్రాలు చోటుచేసుకున్నాయి. హిందూపురం పట్టణంలోని 10వ వార్డు ఓటరు జాబితాలో కన్నడలో పేర్లుండటం చూసి ఓటర్లే నివ్వెర పోతున్నారు. తెలుగు అక్షరాల్లో ఓటరు జాబితా విడుదలైతే కన్నడలో ఎలా వచ్చిందని ఆశ్చర్యపోతున్నారు. అదేవిధంగా అదేవార్డులో మృతిచెందిన వారి పేర్లు తొలగించాలని మృతుల బంధువులు దరఖాస్తు చేసుకున్నా ఇప్పటికీ ఆ పేర్లు అలాగే ఉన్నాయి. వీటిపై అధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.


తికమక ఓటరు జాబితా


తప్పుల తడకగా హిందూపురం ఓటరు లిస్టు

అయోమయంలో ఓటర్లు

హిందూపురం అర్బన్, జనవరి 27: నియోజకవర్గంలో ఓటరు జాబితా తికమకగా ఉంది. చాలా ప్రాంతాల్లో జాబితాలో పేర్లు తప్పు పడటం, డోర్ నెంబర్లు లేకుండా ఉండటంతో ఓటర్లు అయోమయంలో పడుతున్నారు. హిందూపురం ముద్దిరెడ్డిపల్లి అరవిందనగర్‌కు చెందిన పార్టు నెంబర్ 29, సీరియల్ నెంబర్ 31లో మహేష్, తండ్రిపేరు బలిజ వెంకటేష్‌గా ఉండాలి. ఐతే ఓటరు జాబితాలో ఓటరు పేరు సోపోపగాను అతడి తండ్రిపేరు వోతరగ అని నమోదు చేశారు. సీరియల్ నెంబర్ 336 హెచ్‌ఎన్ భరత్‌కుమార్, తండ్రి పేరు నాగరాజుకు సంబంధించి డోరు నెంబర్ అనే చోట ముద్దిరెడ్డిపల్లి అని ఉంది. ఇంటి డోర్ నెంబర్ లేకపోతే కనిపెట్టడం చాల కష్టం. అంతే కాకుండా ఓటు నమోదు సమయంలో ఓటు వేయకుండా అడ్డుకునే అవకాశం ఉంది. మండలంలో తూమకుంట ప్రాంతంలో ఎల్ సంజయ్, తండ్రి గంగాధరప్ప. అయితే ఓటరు జాబితాలో ఇంటి సంఖ్య వద్ద న్యూ అని ఉంది. ఇలా తప్పుల తడకగా ఓటరు జాబితా ఉంది. అధికారులు ఏం చర్యలు తీసుకుంటారో మరి.


ఇలా తప్పుగా నమోదు అయిన దృశ్యం


డోర్‌నెంబర్ ఉండాల్సిన చోట ప్రాంతంను సూచించిన దృశ్యం


ఇంటి నెంబర్ ఉండాల్సిన చోట న్యూ అని ఉంది


పాటలు పాడుతున్న పూర్వ విద్యార్థులు

అలరించిన భక్తిగీతాలు

పుట్టపర్తి, జనవరి 27: సత్యసాయి కళాశాల పూర్వ విద్యార్థులు భక్తిగీతాల ఆలాపనతో భక్తులను అలరించారు. సాయికుల్వంత్‌లో ప్రేమకీ పరిభాషా పేరుతో శనివారం సాయంత్రం భక్తిగీతాలను ఆలపించారు. గంటపాటు సత్యసాయి ప్రేమతత్వంపై మధురగానం చేశారు. అంతకుముందు హీరా గ్లోబల్ కన్వెన్షన్ సెంటర్‌లో సత్యసాయి జాతీయ లీడర్‌షిప్ సదస్సు నిర్వహించారు. అనంతరం వారు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

ఉద్యోగభద్రత కల్పించండి

డీఆర్‌డీఏ, ఐకేపీ ఉద్యోగులు


నిరసన ర్యాలీలో పాల్గొన్న డీఆర్‌డీఏ, ఐకేపీ ఉద్యోగులు.. రిలే దీక్షల్లో...



పుట్టపర్తి, జనవరి 27: కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించి, ఉద్యోగభద్రత కల్పించాలంటూ డీఆర్‌డీఏ, ఐకేపీ ఉద్యోగులు శనివారం డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధనలో భాగంగా చేస్తున్న నిరసనలో నాలుగో రోజు గణేష్ సర్కిల్ నుంచి డీఆర్‌డీఏ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. గణేష్ సర్కిల్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. అనంతరం డీఆర్‌డీఏ కార్యాలయం వద్ద రిలేదీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్య మంత్రి జగన్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఉద్యోగభద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారని, దాన్ని నిలపెట్టుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించేవరకు రిలేదీక్షలు, సమ్మె కొనసాగిస్తామన్నారు. ఉద్యోగ విరమణ వయసు 62ఏళ్లకు పెంచాలని, అర్హులైనవారికి ప్రమోషన్ కల్పించాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని తదితర డిమాండ్లతో నిరసన తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రామాంజులు, లక్ష్మీనరసప్ప, చంద్రారెడ్డి, శ్రీరామునాయక్, జెఏసి నాయకులు రామమోహన్, జెసీ కన్వీనర్ రామేశ్వర్‌రెడ్డి, శంకర్, గోపాల్, వెంకటనారాయణ, శివమ్మ, పద్మావతి, శివశంకర్, లక్ష్మణ, క్రిష్టారెడ్డి పాల్గొన్నారు.

జాగ్రత్తలే శ్రీరామ రక్ష

వాహనాలు నడిపేటప్పుడు నిబంధనలు పాటించాలి.. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో ఎస్పీ మాధవరెడ్డి


సూచనలు ఇస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

హిందూపురం అర్బన్, జనవరి 27: వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటించి ప్రాణాపాయం లేకుండా వ్యవహరించాలని ఎస్పీ మాధవరెడ్డి పేర్కొన్నాడు. హిందూపురం రవాణాశాఖ అధికారి కరుణాసాగర్‌రెడ్డి ఆధ్వర్యంలో, కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు నిర్వహించిన రోడ్డు భద్రతా మాసోత్సవాల ర్యాలీకి శనివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని, కారు లాంటి పెద్ద వాహనాలు నడిపేటప్పుడు సీటు బెల్టు ధరించి జాగ్రత్తలు పాటించాలన్నారు. నిర్లక్ష్యంతో వాహనాలు నడపరాదన్నారు. ఇంటి నుంచి బయటకు రాగానే కుటుం సభ్యులను గుర్తు చేసుకుంటూ వాహనం నడపాలన్నారు. ప్రమాదంలో కుటుంబ పెద్దకు ఏదైనా జరిగితే ఆ కుటుంబం మొత్తం రోడ్డున పడుతుందన్న విషయాన్ని అందరూ గుర్తు పెట్టుకోవాలన్నారు. అనంతరం అంబేడ్కర్ సర్కిల్‌లో జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. అంబేడ్కర్ సర్కిల్, సద్భావన్ సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్, మేళాపురం తెలుగుతల్లి సర్కిల్, రిలయన్స్ పెట్రోల్ బంక్, రహమత్‌పురం మీదుగా ఆర్టీఓ కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. కార్యక్రమంలో రవాణా శాఖ ఉప అధికారులు శివ శంకర్, జయశ్రీ యాదవ్, ఉదయ్‌కుమార్ నాయుడు, సిబ్బంది చైతన్య, బాలాజీ, టూ టౌన్ సీఐ రియాజ్ అహ్మద్, రూరల్ సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ హరున్‌బాషా, పోలీస్ సిబ్బంది, వాహన కంపెనీల యాజమాన్యం, సిబ్బంది పాల్గొన్నారు.



ఉప్పొంగిన ఉరవకొండ



వైసీపీ పాలనపై సమర భేరి మోగిస్తూ.. ఐదేళ్ల దురాగతాలపై ప్రజలను చైతన్యం చేసేందుకు టీడీపీ అధినేత చంద్రబాబు నిర్వహించిన రా.. కదలి రా సభకు జన సునామీ పోటెత్తింది. 'మీరు పిలిస్తే రాకుండా ఉంటామా..' అన్నట్లుగా వేలాది మంది స్వచ్ఛందంగా ఉవరకొండ సభకు ఉత్సాహంగా వచ్చారు. చంద్రబాబును చూడగానే మహిళలు, యువతులు సైతం ఈలలు, కేకలతో కేక పుట్టించారు. జగన్ మాయ మాటలను నమ్మి ఓట్లేసినందుకు రాష్ట్రం 30 ఏళ్ల వెనక్కు వెళ్లిందని, ఇంకో అవకాశం వారికిస్తే సర్వనాశనం తప్పదని చంద్రబాబు హెచ్చరించారు. మరో ఇరభై ఏళ్లలో తెలుగువారిని ప్రపంచంలో నంబర్ వన్ చేయాలన్నదే తన లక్ష్యమని, అందుకు సహకారం అందించాలని ప్రజలను కోరారు. తన గుండెకు దగ్గరగా ఉన్న జిల్లా అనంతపురం అని ఉద్వేగంగా ప్రసంగించారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తానని, జిల్లాలోని ప్రతి ఎకరాకూ సాగు నీరు ఇస్తానని హామీ ఇచ్చారు. కార్యకర్తల జోలికి వచ్చే వైసీపీ వారిని ఊరికే వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు.

రా.. కదలి రా సూపర్ సక్సెస్

వైసీపీ పాలనపై విరుచుకుపడ్డ చంద్రబాబు

టీడీపీ-జనసేన కూటమిదే అధికారమని ధీమా

అనంతలో ప్రతి ఎకరానికి నీరిస్తానని హామీ (5లో..)

ఉప్పొంగిన ఉరవకొండ

రా.. కదలి రాతో ఉరకలెత్తిన ఉత్సాహం

పార్టీ శ్రేణులు, జనానికి చంద్రబాబు భరోసా

టీడీపీ-జనసేన కూటమిదే అధికారమని ధీమా

అనంతపురం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): 'రా కదలి రా' బహిరంగ సభకు జనం పోటెత్తారు. పార్టీ శ్రేణులు, ప్రజల్లో ఉత్సాహం ఉరకలెత్తింది. అశేష జనవాహినితో ఉరవకొండ జనసంద్రంగా మారింది. అనంతపురం అర్బన్ మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి అధ్యక్షతన శనివారం ఈ సభను నిర్వహించారు. టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హాజరై ప్రసంగించారు. పార్టీ శ్రేణులు, కరువు జిల్లా ప్రజానీకానికి భరోసా ఇచ్చారు. సీఎం జగన్ సైకో పాలన సాగిస్తున్నారని నిప్పులు చెరిగారు. ఆ పార్టీ ఎమ్మెల్యేల అవినీతిని తూర్పారబట్టారు. వైసీపీ పనైపోయిందని, టీడీపీ, జనసేన కూటమిదే అధికారమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడ్డారని, టీడీపీ-జనసేన కూటమి అధికారంలోకి రాగానే ఆ వర్గాలను ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా పైకి తీసుకొస్తానని హామీ ఇచ్చారు. అనంతపురం జిల్లా అంటే తనకు అమితమైన అభిమానమని, తన గుండెకు దగ్గరగా ఉండేది ఈ జిల్లానే అని అన్నారు. పెండింగ్ ప్రాజెక్టుల పనులన్నీ పూర్తి చేసి, జిల్లాలోని ప్రతి ఎకరానికీ సాగునీరు అందించి అన్నదాతను ఆదుకుంటానని అన్నారు. వైసీపీ అరాచక పాలనలో ఇబ్బందులు పడిన ప్రతి కార్యకర్తను ఆదుకుంటానని శ్రేణుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపారు. తన కార్యకర్తల జోలికొస్తే ఎవ్వరినీ వదిలిపెట్టనని, ఖబడ్దార్ వైసీపీ గుండాల్లారా అని హెచ్చరించారు.

తరలివచ్చిన నాయకులు

ఉరవకొండ సభకు పార్టీ రాయలసీమ జోన్ పరిశీలకుడు బీద రవిచంద్ర యాదవ్, మాజీ మంత్రులు కాలవ శ్రీనివాసులు, పరిటాల సునీత, పల్లె రఘునాథ రెడ్డి, పీఏసీ చైర్మన్, ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, మాజీ ఎమ్మెల్యేలు వైకుంఠం ప్రభాకర్ చౌదరి, జితేంద్రగౌడ్, ఉన్నం హనుమంతరాయచౌదరి, మాజీ ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎస్ రాజు, రాయలసీమ జోన్ మీడియా కోఆర్డినేటర్ బీవీ వెంకటరాముడు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు ఉమామహేశ్వరనాయుడు, పరిటాల శ్రీరామ్, శింగనమల టూమెన్ కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, ఆ నియోజకవర్గ నాయకురాలు బండారు శ్రావణి శ్రీ, జడ్పీ మాజీ చైర్మన్ పూల నాగరాజు, మాజీ మేయర్ స్వరూప, రాష్ట్ర నాయకులు వెంకటశివుడు యాదవ్, సవిత, గౌస్‌మొద్దీన్, రామ్మోహన్ చౌదరి, బుగ్గయ్య చౌదరి, జేఎల్ మురళి, శివబాల, తలారి ఆదినారాయణ, గాజుల ఆదెన్న, గడ్డం సుబ్రహ్మణ్యం, విశాలాక్షి, దండు శ్రీనివాసులు, రాయల్ మురళి, అంజనప్ప, కుంచెపు వెంకటేష్, వెంకటప్ప, జనసేన నాయకులు టీసీ వరుణ్, చిలకం మధుసూదన్‌రెడ్డి, పెండ్యాల శ్రీలత తదితరులు తరలివచ్చారు.



వేదికపై గుసగుసలు



జగన్‌కు దిమ్మతిరగాలి

ఉమ్మడి జిల్లాను తాను ఎక్కువగా అభిమానిస్తానని చంద్రబాబు అన్నారు. తన గుండెకు దగ్గరగా ఉండే జిల్లా అనంతపురం అని అన్నారు. ఒకప్పుడు వర్షం పడక పంట రాకపోతే మొట్టమొదటిసారి వేరుశనగ పంటకు ఇన్‌పుట్ సబ్సిడీ అందించి, రైతాంగాన్ని ఆదుకున్నామని అన్నారు. కరువు ఏర్పడినప్పుడు పశువుల మేపుకునేందుకు రైతులకు క్యాంపులు పెట్టామని గుర్తు చేశారు. అప్పటి నుంచే జిల్లాకు నీరు తీసుకురావాలనే ఆకాంక్ష పెరిగిందని అన్నారు. ఆ క్రమంలోనే హంద్రీనీవాను తీసుకొచ్చామని అన్నారు. ప్రతి ఎకరానికీ నీరిచ్చి, పేదరికం లేకుండా చేసి, పొలంలో బంగారం పండించే వరకు రైతులకు తాను అండగా ఉంటామని చంద్రబాబు అన్నారు. అధికారంలోకి రాగానే చేసి చూపిస్తానని అన్నారు. 'ఈ సారి ఎన్నికల్లో మీరిచ్చే ఫలితాలు జగన్‌కు దిమ్మతిరగాలి' అని ప్రజలతో అన్నారు. ఉమ్మడి జిల్లాలో 14 అసెంబ్లీ స్థానాలు, రెండు ఎంపీ స్థానాలలో టీడీపీ, జనసేన కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. టీడీపీ జెండా ఎగరాలి.. వైసీపీ జెండా భూస్థాపితం కావాలి అని అన్నారు.

అభివృద్ధి చేస్తా..

జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే తన ధ్యేయమని చంద్రబాబు అన్నారు. జిల్లాకు జీవనాడైన డ్రిప్ ఇరిగేషన్‌ను మళ్లీ తీసుకొస్తానని అన్నారు. భైరవాన్ తిప్ప, పేరూరు ప్రాజెక్టులను పూర్తి చేస్తానని అన్నారు. గుంతకల్లు బ్రాంచ్ కెనాల్‌లోని పెండింగ్‌లో ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్ పనులు పూర్తి చేస్తానని అన్నారు. గార్లదిన్నె, శింగనమలలో షాదీఖానాలు కట్టిస్తామని అన్నారు. రద్దు చేసిన సబ్ ప్లాన్లు మళ్లీ అమలు చేసి, వెనుకబడిన వర్గాలను ఆదుకుంటామని అన్నారు. ఆ వర్గాలను ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా పైకి తీసుకొచ్చి, వారి రుణాన్ని తీర్చుకుంటానని అన్నారు. ఆ వర్గాలన్నీ తెలుగుదేశాన్ని ఆశీర్వదించాలని కోరారు. సామాజిక న్యాయానికి మారుపేరు టీడీపీ అని అన్నారు. మాదిగలకు న్యాయం చేయబోయేది టీడీపీనే అని అన్నారు. మైనార్టీలకు అన్ని విధాలుగా న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. గండికోట, నిట్టూరు, బుక్కాపురం లిఫ్ట్ ఇరిగేషన్‌ను పూర్తి చేస్తామని అన్నారు. చిత్రావతి నదిపై తాడిపత్రి - పులివెందుల బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేస్తామని అన్నారు. ఉరవకొండలో చేనేత కార్మికులకు చేయూత అందిస్తామని అన్నారు. జీడిపల్లి రిజర్వాయర్ నిర్వాసితులకు నష్టపరిహారం అందిస్తామని హామీ ఇచ్చారు.

మహిళలకు రక్షణ ఏదీ..?

జగన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అయితే మీ ఆస్తులు మీవి కాకుండా పోతాయని చంద్రబాబు అన్నారు. ఎవరు ఎదురు మాట్లాడితే వారి ప్రాణాలు ఉండవని అన్నారు. ఈ అరాచక పాలనలో ఆడబిడ్డలకు రక్షణ లేదని, ఇందుకు బ్రహ్మసముద్రంలో జరిగిన సంఘటనే నిదర్శనమని అన్నారు. తన కోరిక తీర్చలేదని ఓ కిరాతకుడు నడి బజారులో ఆడబిడ్డను కొడితే పోలీసులు వెళ్లలేదంటే సిగ్గుగా లేదా అని ఆయన మండిపడ్డారు. 'మీ ఇంట్లో ఆడవాళ్లకు ఇలా జరిగితే మీరు సహిస్తారా?' అని పోలీసులను నిలదీశారు. 'అంబోతురాలా జాగ్రత్త.. వీలాంటి అంబోతులను నడిరోడ్డులో బట్టలు ఊడదీసి ఊరేగిస్తాం' అని హెచ్చరించారు. ఆడ బిడ్డలకు రక్షణగా టీడీపీ అండగా ఉంటుందని అన్నారు.

కార్యకర్తలకు అండ..

అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా కార్యకర్తలు టీడీపీతోనే ఉన్నారని చంద్రబాబు అన్నారు. జగన్ విధ్వంసాన్ని, తుగ్లక్ పాలనను ప్రశ్నించిన టీడీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి వేధించినా.. దాడులు చేసినా ఎదుర్కొన్నారని అన్నారు. పోలీసు వ్యవస్థను అనుబంధ వ్యవస్థగా మార్చుకొని, వైసీపీ వారు రాక్షస క్రీడ ఆడారని అన్నారు. 'ప్రాణాలు తీస్తున్నా ఒకే మాట.. జై చంద్రన్న, జై తెలుగుదేశం అంటూ ప్రాణాలు వదిలే కార్యకర్తలు ఉన్నారు. కష్టకాలంలో పనిచేసిన టీడీపీ కార్యకర్తలకు న్యాయం చేసే బాధ్యత నాది. ఏ గ్రామంలో ఎవరెవరు మిమ్మల్ని ఇబ్బంది పెట్టారో... చిత్రగుప్తుడిలాగా రాసుకుంటున్నా. వడ్డీ, చక్రవడ్డీ సహా తిరిగి చెల్లిస్తా' అని వైసీపీ నాయకులను హెచ్చరించారు. పోలీసులకు అండగా ఉండే పార్టీ టీడీపీ అని అన్నారు. 'మీ డ్యూటీ మీరు చేయండి. చట్టవిరుద్ధంగా వ్యవహరించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం' అని అన్నారు.

జిల్లాకు అన్యాయం..

జగన్ జిల్లాకు తీరని అన్యాయం చేశారని చంద్రబాబు మండిపడ్డారు. గోదావరి నీటిని రాయలసీమకు తీసుకురావాలన్నదే తన ఆకాంక్ష అని అన్నారు. కొంత వరకు జయప్రదం చేశామని, టీడీపీ అధికారంలో ఉండి ఉంటే పూర్తిగా నెరవేరేదని అన్నారు. టీడీపీ హయాంలో నీళ్లు ఇవ్వడం ద్వారా రైతులు కోట్లు సంపాదించారని అన్నారు. ఉరవకొండ నియోజకవర్గంలో 50 ఎకరాల్లో కౌలు రైతు రూ.2.30 కోట్లు సంపాదించారని అన్నారు. 90 శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలు ఇచ్చామని గుర్తు చేశారు. 10 లక్షల ఎకరాలకు డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యం కల్పించామని అన్నారు. తద్వారా ఉద్యాన పంటలను పండించి, రైతులు డబ్బులు బాగా సంపాదించారని అన్నారు. జిల్లాలో నీరుంటే .. గోదావరి జిల్లాలు కూడా పోటీ పడలేవని అన్నారు. అక్కడ వరి మాత్రమే పండించుకోవాలని, అనంతలో ప్రపంచంలోని అన్ని రకాల వాణిజ్య పంటలు పండించే పరిస్థితి వస్తుందని అన్నారు. గత 25 ఏళ్లతో పోలిస్తే భూమి విలువ పెరిగిందని అన్నారు. వ్యవసాయ రంగానికి ప్రాధాన్యమివ్వడం ద్వారా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు ఈ రంగంలోకి వచ్చే పరిస్థితి వచ్చిందని అన్నారు. ఉరవకొండలో కమ్యూనిటీ డ్రిప్ ఇరిగేషన్‌ను మొదలుపెట్టామని, ఇది పూర్తై ఉంటే 50 వేల ఎకరాల్లో పంటలు పండించేవారని, తద్వారా సంపద పెరిగేదని అన్నారు. కమ్యూనిటీ డ్రిప్ ఇరిగేషన్‌ను ఆపేసి రూ.30 కోట్లు వృథా చేశారని, డ్రిప్ పరికరాలు, పైపులు తప్పుపట్టాయని అన్నారు. రైతులకు వైసీపీ తీరని అన్యాయం చేసిందని విమర్శించారు. ఇలాంటి వ్యక్తి సీఎం పదవికి అర్హుడా అని ప్రశ్నించారు. 'ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ ఇచ్చాడా..? డీఎస్సీ పెట్టాడా?' అని ప్రశ్నించారు. దిగిపోయేటప్పుడు నోటిఫికేషన్ ఇస్తాడంట.. ఇంకా ఎవరినిమోసం చేయాలని అనుకుంటున్నారో అని ఎద్దేవా చేశారు.



ఎవ్వరినీ వదిలిపెట్టం..

దొంగ ఓట్లు నమోదు చేసిన అధికారులను, దొంగ ఓట్లు వేసే వైసీపీ నాయకులను ఎవర్నీ వదిలిపెట్టబోమని చంద్రబాబు అన్నారు. ఉరవకొండలో దొంగ ఓట్లపై పయ్యావుల కేశవ్ పోరాటంతో ఇద్దరు అధికారులను సస్పెండ్ చేశారని గుర్తు చేశారు. జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు.

అవినీతిని ఎండగట్టిన బాబు

జిల్లాలోని వైసీపీ ఎమ్మెల్యేల అవినీతిని చంద్రబాబు తూర్పారబట్టారు. అక్రమాల్లో విశ్వరూపం చూపిస్తాడని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి అవినీతిని ఎండగట్టారు. ఎక్కడ లే అవుట్ వేసినా ఆయనకు కప్పం కట్టాల్సిందేనని అన్నారు. చివరకు గాలిమరల సెక్యూరిటీ సిబ్బంది జీతాల్లోనూ వాటా ఇవ్వాల్సిందేనని అన్నారు. తప్పుడు ఎన్ఓసీలు సృష్టించి, ఆడబిడ్డల భూములను విశ్వేశ్వరరెడ్డి కుమారుడు కొట్టేశాడని ఆరోపించారు. అలాంటి వ్యక్తిని ఇన్‌చార్జిగా జగన్‌రెడ్డి నియమించారని మండిపడ్డారు. ఈ నియోజకవర్గంలో ఏదైనా అభివృద్ధి జరిగిందంటే అది పయ్యావుల కేశవ్ వల్లేనని అన్నారు. మంత్రి ఉష శ్రీచరణ్ కరప్షన్ క్వీన్ అని విమర్శించారు. రూ.30 కోట్ల విలువైన సుజలాన్ విండ్ పార్కు భూములను డ్రైవర్ పేరుతో ఆమె కాజేశారని అన్నారు. పెన్నా నదిలో ఇసుకను అక్రమంగా తరలించారని, అక్రమ లే అవుట్లు వేసి ఇష్టానుసారంగా అమ్ముకున్నారని అన్నారు. పేద వారికిచ్చే ఇంటి జాగాలో వంద ఎకరాలను రూ.6 లక్షలకు కొని రూ.25 లక్షల చొప్పున ప్రభుత్వానికి అమ్ముకున్నారని ఆరోపించారు. అందుకే కళ్యాణదుర్గం నుంచి పెనుకొండకు ఆమెను జగన్ మార్చారని అన్నారు. ఈ ఊర్లో ఉన్న చెత్త ఏ ఊర్లోనూ బంగారం అవ్వదని, ఆ చెత్తను డంప్‌యార్డుకు పంపించాలని ప్రజలను కోరారు. ప్రశాంతంగా ఉన్న తాడిపత్రిలో మరలా ఫ్యాక్షనిజాన్ని తీసుకొచ్చారని, ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఓ దొడ్డరెడ్డి.. పోలీసులను అడ్డుపెట్టుకొని ఎగిరెగిరి పడుతున్నారని, వడ్డీతో సహా చెల్లిస్తామని హెచ్చరించారు. శింగనమల నియోజకవర్గాన్ని ముక్కలు ముక్కలు చేసిన ఎమ్మెల్యేకు సీటు లేకుండా పోయిందని అన్నారు. మాట్లాడితే కేసులు పెడతారేమోనని ఆమె మౌనంగా ఉండిపోయారని అన్నారు. రాయదుర్గం ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి జగన్‌రెడ్డికి కాపు కాశారని, టికెట్ లేదు పొమ్మంటే తాడేపల్లి ప్యాలెస్‌కు సెల్యూట్ కొట్టి బైబై చెప్పారని అన్నారు. గుంతకల్లులో ఇసుక స్టాక్ పాయింట్ పెట్టి, ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి అమ్ముకుంటున్నారని ఆరోపించారు. అక్కడ ఎవరు గాలిపీల్చినా కప్పం కట్టాల్సిందేనంట అని మండిపడ్డారు. అనంతపురం ఎమ్మెల్యే రిటైర్‌మెంట్‌కు వచ్చేసి, చిల్లరకొట్టుడు కొట్టుకుంటున్నారని అన్నారు. ఇలాంటి ఎమ్మెల్యేల చెత్త తమకు వద్దని ప్రజలు ఛీదరించుకుంటున్నారని అన్నారు.



గెలుపు గుర్రాలకే టికెట్

అభ్యర్థి ఎవరైనా సమష్టిగా పనిచేయాలి .. ఉమ్మడి జిల్లాలో అన్నిస్థానాల్లో టీడీపీ-జనసేన కూటమి జెండా ఎగరాలి

పార్టీ ముఖ్యనేతలకు చంద్రబాబు దిశానిర్దేశం



ముఖ్యనేతలతో సమావేశమైన చంద్రబాబు

అనంతపురం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): రానున్న ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో 14 అసెంబ్లీ, 2 పార్లమెంట్ స్థానాల్లో టీడీపీ, జనసేన కూటమి జెండా ఎగరాలని టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఆ పార్టీ ముఖ్యనేతలకు సూచించారు. ఆ మేరకు శనివారం రాత్రి ఉరవకొండలోని విడిది కేంద్రంలో జిల్లాకు చెందిన ఆ పార్టీ ముఖ్య నాయకులతో చంద్రబాబు అంతర్గత సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. రానున్న ఎన్నికల్లో గెలుపు గుర్రాలకే టికెట్లు ఖరారు చేస్తామన్నారు. ముఖ్యంగా యువతతోపాటు బలహీన వర్గాలు, మైనార్టీలు, మహిళలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. అభ్యర్థి ఎవరైనా ఆ అభ్యర్థి గెలుపు కోసం సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. టీడీపీ, జనసేన కూటమి అధికారంలోకి వస్తేనే అందరికీ న్యాయం జరుగుతుందన్నారు. అధికారంలోకి రాగానే కష్టపడి పనిచేసిన వారికి తగిన గౌరవం కల్పిస్తామన్నారు. వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడటంతోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని సైకో పాలనను అంతమొందించేందుకు, ప్రజల్లో మరింతగా చైతన్యం నింపే బాధ్యతను నాయకులుగా మీ భుజాలపై ఎత్తుకోవాలని చంద్రబాబు ముఖ్యనాయకులకు సూచించారు.

జనమే జనం..!

ఉరవకొండ/విడపనకల్లు, జనవరి 27: 'రా.. కదిలి రా' సభకు నియోజకవర్గం నలుమూలల నుంచి టీడీపీ కార్యకర్తలు వేల సంఖ్యలో తరలి వచ్చారు. అంచనాలు మించి జనం రావటంతో పోలీసు యంత్రాంగం అదుపు చేయలేకపోయింది. మాజీ సీఎం చంద్రబాబు నాయుడు హెలిప్యాడ్ నుంచి వేదికపైకి వచ్చేందుకు పోలీసులు వెనుక వైపు నుంచి దారి ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 3.45 గంటలకు హెలిప్యాడ్‌లో దిగిన చంద్రబాబును చూసేందుకు జనం ఎగబడ్డారు. పోలీసులు అనుమతించకపోవటంతో చంద్రబాబు వచ్చే దారిలో ఏర్పాటు చేసిన వచి బారికేడ్లను తోసుకుని జనం స్టేజ్ వద్దకు చేరుకున్నారు. ఈ నెల 23న సీఎం జగన్ పర్యటన సందర్భంగా.. సభా వేదికను పొడవుగా ఏర్పాటు చేసి జనాన్ని అధికంగా చూపించే ప్రయత్నం చేశారు. వివిధ ప్రాంతాల మహిళలను బెదిరించి బస్సులలో బలవంతంగా సభకు తరలించారు. కానీ టీడీపీ కార్యకర్తలు స్వచ్ఛందంగా వేల సంఖ్యలో తరలివచ్చి, సభా ప్రాంగణాన్ని జనసంద్రంగా మార్చేశారు. టీడీపీ అభిమానాన్ని చాటుకుంటూ, చంద్రబాబును చూసేందుకు ఫ్లడ్ లైట్ల కోసం ఏర్పాటు స్తంభాలపైకి ఎక్కారు.

ఘన స్వాగతం

ఉరవకొండకు వచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబుకు స్థానిక ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు కాలవ, పలువురు నాయకులు పుష్ప గుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. హెలిప్యాడ్‌లో దిగిన తరువాత చంద్రబాబు బస్సులో అర గంట సేద తీరారు. ఆ సమయంలో వేదికపై ఉన్న పార్టీ నాయకులు ప్రసంగాలను పూర్తి చేశారు. అనంతరం వేదికపైకి వచ్చిన చంద్రబాబు.. గంటకుపైగా ప్రసంగించారు. చీకటి పడుతున్నా జనం కదలకుండా, ఆసక్తిగా ఆయన ప్రసంగాన్ని విన్నారు. ఈలలు, కేకలు వేస్తూ మద్దతు తెలిపారు. బహిరంగ సభ పూర్తి అయిన తరువాత జాతీయ రహదారిపై వాహనాలు అరగంటకు పైగా నిలిచిపోయాయి. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు లేక పోవటంతో టీడీపీ కార్యకర్తలే ట్రాఫిక్ నియంత్రణ విధులను నిర్వర్తించారు.

గుత్తి రైల్వే డీజిల్ షెడ్‌ను తనిఖీ చేసిన డీఆర్ఎం

గుత్తి ,జనవరి 27: గుంతకల్లు రైల్వే డివిజన్ పరిధిలోని గుత్తి డీజిల్ షెడ్‌ను శనివారం గుంతకల్లు డీఆర్ఎం వినీత్ సింగ్ తనిఖీ చేశారు. ఆర్వోహెచ్ షెడ్‌ను పరిశీలించారు. రైల్వే హెల్త్ యూనిట్‌ను తనిఖీ చేశారు. ముందుగా రన్నింగ్ రూంలో లోకో పైలెట్, అసిస్టెంట్ లోకోపైలెట్ కుటుంబ సభ్యులతో సమావేశం నిర్వహించారు. కుటుంబ సభ్యులతో కార్మికుల సమస్యలను తెలుసుకున్నారు. ఇది వరకు క్రీడల్లో రాణించిన వారికి బహుమతులను అందజేశారు. రైల్వే హెల్త్ యూనిట్‌లో అంబులెన్స్, ల్యాబ్ సౌకర్యం లేదని గైనాకాలజిస్టు, చిన్నపిల్లల డాక్టర్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఉద్యోగులు ఆయనకు వివరించారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. ఏడీఆర్ఎం సుధాకర్, సీనియర్ డీపీఓ చౌహాన్, సీనియర్ డీఈ వీరయ్య, డీఎంఈ రమేష్, డాక్టర్ విజయలక్ష్మి, కార్మికుల యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు హౌస్ వైరింగ్‌లో శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 27: జిల్లాలోని నిరుద్యోగ యువకులకు హౌస్ వైరింగ్‌లో నైపుణ్య శిక్షణ, ఉద్యోగ అవకాశం కల్పిస్తామని టాటా స్ట్రైవ్ సంస్థ కోఆర్డినేటర్ పద్మావతి తెలిపారు. అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ హౌస్ వైరింగ్ కోర్సులో నైపుణ్య శిక్షణ ఉంటుందన్నారు. మరమ్మతులపై శిక్షణతో పాటు వ్యక్తిత్వవికాసం, ఇంగ్లీష్, కస్టమర్లతో ఎలా మెలగాలి అనే అంశాలపై శిక్షణ ఉంటుందన్నారు. 3 నెలల పాటు ఇచ్చే శిక్షణకు 18-30 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి పదోతరగతి, ఇంటర్, ఐటీఐ చదివి ఉండాలని తెలిపారు. మూడు నెలల పాటు పులివెందులలోని టాటా స్ట్రైవ్ సంస్థలో శిక్షణ పొందిన ప్రతి అభ్యర్థికి సర్టిఫికెట్ అందజేస్తామని, అనంతరం నూరు శాతం ఉపాధి కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 6301162108 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

గ్రూప్1, 2 శిక్షణకు మరో అవకాశం

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 27: ఏపీపీఎస్సీ ద్వారా నిర్వహిస్తున్న గ్రూప్-1,2 ప్రవేశ పరీక్షకు శిక్షణ పొందేందుకు మరో అవకాశం కల్పిస్తున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కుష్బూకొఠారీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇది వరకు విడుదల చేసిన నోటిఫికేషన్ మేరకు గత సంవత్సరం డిసెంబరులో శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయన్నారు. ఇచ్చిన నోటిఫికేషన్ మేరకు ఖాళీలు ఉన్న నేపథ్యంలో... ఆ ఖాళీలను భర్తీ చేయడంలో భాగంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న అభ్యర్థులకు మరో అవకాశాన్ని కల్పిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఉమ్మడి అనంత జిల్లా వ్యాప్తంగా గ్రూప్1, 2కు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులు అనంతపురంలోని బీసీ స్టడీ సర్కిల్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మెరిట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేసి వారికి శిక్షణ ఇస్తామన్నారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హత్యకేసులో నిందితుడి అరెస్టు

తనకల్లు, జనవరి 27: మండలంలోని నడింకుంటపల్లి గ్రామంలో బుధవారం రాత్రి చేలకూర విషయంపై గొడవపడి అన్న సంజీవులును తమ్ముడు వెంకటేశ్ హత్య చేశాడు. ఈ కేసులో నిందితుడు వెంకటేశ్‌ను శుక్రవారం రాత్రి పొద్దుపోయిన తరువాత కొక్కంటిక్రాస్‌లో కదిరి రూరల్ సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో తనకల్లు పోలీసులు వలపన్ని పట్టుకున్నారు. నిందితుడిని విచారించగా హత్యకు ఉపయోగించిన మందపాటి చెక్కను నడింకుంటపల్లి సమీపంలో మోరీ కింద దాచినట్లు తెలిపాడు. పోలీసులు అక్కడికెళ్లి చెక్కను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టు ఎదుట హాజరు పరిచినట్లు పోలీసులు తెలిపారు.

పీఆర్టీయూ కార్యవర్గం ఎంపిక

అనంతపురం విద్య, జనవరి 27: అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల పీఆర్టీయూ నూతన కార్యవర్గాలను ఎంపిక చేసినట్లు ఆ సంఘం ఉమ్మడి అనంతపురం జిల్లా సమన్వయకర్త విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక ఆ సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా కృష్ణయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు రెండు జిల్లాలకు కొత్త కార్యవర్గ సభ్యులను ఎంపిక చేశామన్నారు. అనంతపురం జిల్లా అధ్యక్షుడిగా పురుషోత్తంరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా తిమ్మారెడ్డిని, శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షుడిగా రామకృష్ణారెడ్డిని, ప్రధాన కార్యదర్శిగా చంద్రశేఖర్‌రెడ్డిని ఎంపిక చేశామన్నారు.



పురుషోత్తంరెడ్డి



తిమ్మారెడ్డి

లేపాక్షి శిల్పకళ అమోఘం

- **హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మన్మదరావు**

హిందూపురం, జనవరి 27: లేపాక్షి శిల్పకళ అమోఘమని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మన్మదరావు అన్నారు. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన లేపాక్షి దుర్గా, వీరభద్రస్వామి ఆలయాన్ని శనివారం ఆయన సతీసమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ పరిసరాల్లోని చిత్రకళ, ఏడు శిరస్సుల నాగేంద్రుడు, అర్ధంతరంగా ఆగిన కల్యాణమండపం, సీతాదేవిపాదం, వేలాడే స్తంభాన్ని ఆశ్చర్యంగా వీక్షించారు. ఆలయ చరిత్రను, విశిష్టతను అర్చకులు వారికి వివరించారు. అనంతరం న్యాయమూర్తి మాట్లాడుతూ అలనాటి శిల్పుల నైపుణ్యాన్ని కొనియాడారు. భారతీయ సంస్కృతి ఉట్టిపడేలా శిల్పకళా చిత్రాలు ఉన్నాయన్నారు. ఆలయాన్ని సందర్శించడం ఆనందంగా ఉందన్నారు. ఆయన వెంట హిందూపురం అదనపు జిల్లా న్యాయాధికారి శైలజ, జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి రాజ్యలక్ష్మి, ఆలయ కమిటీ చైర్మన్ రమానంద స్వామి, ఆలయ ఈఓ నరసింహమూర్తి పాల్గొన్నారు.



ఆలయ శిల్ప సంపదను వీక్షిస్తున్న న్యాయమూర్తి దంపతులు



పూజల్లో పాల్గొన్న హైకోర్టు న్యాయమూర్తి దంపతులు

పుట్టపర్తిలో..

పుట్టపర్తి: రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ మన్మదరావును జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు శనివారం కలిశారు. పుట్టపర్తికి వచ్చిన ఆయన్ను కలెక్టర్ ప్రశాంతి నిలయంలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం జడ్జి లేపాక్షి పర్యటనకు వెళ్లారు.

వేరుశనగ విత్తనాభివృద్ధి జరగాలి

కదిరి, జనవరి 27: వేరుశనగ విత్తనాభివృద్ధి జరగాలని జిల్లా వ్యవసాయాధికారి వైవీ సుబ్బారావు, వ్యవసాయ ప్రధానశాస్త్రవేత్త సంపత్‌కుమార్ సూచించారు. శనివారం స్థానిక వ్యవసాయ పరిశోధనాస్థానంలో జిల్లాస్థాయి వ్యవసాయాధికారుల శిక్షణ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా గతంలో 32 వేల హెక్టార్లలో వివిధ పంటలు సాగయ్యేవని, ప్రస్తుతం 18వేల హెక్టార్లలో మాత్రమే సాగవుతున్నట్లు తెలిపారు. ఖరీఫ్‌లో తక్కువ వర్షపాతం వల్ల భూగర్భజలాలు తగ్గిపోయాయన్నారు. తద్వారా రబీ పంటకు భూగర్భజలాల కొరత ఏర్పడి, పంటల సాగు విస్తీర్ణం తగ్గిందన్నారు. హిందూపురం, లేపాక్షి, చిలమత్తూరు మండలాల్లో మొక్కజొన్న పంటకు కత్తెర పురుగు ఆశించిందని, దీని నివారణకు రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. వేరుశనగలో కాండం కుళ్లు తెగులు ఆశించిందని, రైతులు శాస్త్రవేత్తల దృష్టికి తెచ్చారు. ప్రధాన శాస్త్రవేత్త సంపత్ మాట్లాడుతూ వేరుశనగ దిగుబడికి నూతన రకాలను ఇప్పటినుంచి విత్తన పథం ద్వారా విత్తనాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. శిక్షణలో డాక్టర్లు వెంకటరమణ, చిన్నరాయుడు, రామసుబ్బయ్య, ఏఓలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రధాన శాస్త్రవేత్తలు

నేడు పీసీసీ చీఫ్ షర్మిల రాక

- **పలువురు కాంగ్రెస్‌లో చేరే అవకాశం!**
- **ఏర్పాట్లను పరిశీలించిన మాజీ చీఫ్ శైలజానాథ్**

అనంతపురం న్యూటౌన్, జనవరి 27: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆదివారం జిల్లాకు రానున్నారు. ఏపీ పీసీసీ చీఫ్ అయిన తరువాత తొలి సారి జిల్లాకు రానుండటంతో ఆమె పర్యటనకు ప్రాధాన్యం ఏర్పడింది. జిల్లాలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి అభిమానులు పెద్ద ఎత్తునే ఉన్నారు. వీరిలో చాలా మంది వైఎస్ జగన్ పార్టీ పెట్టిన తరువాత అందులో చేరారు. మిగిలిన వారు ఏ పార్టీలోకి వెళ్లకుండా సొంత పనుల్లో నిమగ్నమయ్యారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కొందరు సిట్టింగ్‌లకు వైసీపీలో టికెట్ దక్కలేదు. అలాంటి వారిలో వైసీపీ పట్ల వ్యతిరేకత మొదలైంది. ఈక్రమంలో షర్మిలా పీసీసీ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించారు. వారు కాంగ్రెస్ వైపు వెళ్లే అవకాశం ఉంది. దివంగత రాజశేఖర్‌రెడ్డి వారసురాలిగా కాంగ్రెస్ పార్టీలో కొత్త ఉత్తేజం నెలకొంది. అంతేగాక షర్మిల తన ప్రసంగాల్లో అధికార పార్టీ అక్రమాలను ఎత్తి చూపుతూ ఏకి పారేస్తోంది. దీంతో వైసీపీలో అసంతుష్టులుగా ఉన్న పలువురు వైఎస్ఆర్ అభిమానులు తిరిగి సొంతగూటికి చేరే అవకాశం ఉందన్న చర్చ జరుగుతోంది. ఇప్పటికే జిల్లాలోని పలు మండలాల నుంచి షర్మిల సమక్షంలో కాంగ్రెస్ కండువ కప్పుకోవడానికి సిద్ధంగా ఉన్నట్లు సమాచారం.

సాయంత్రం 5 గంటలకు ఎల్‌కేపీలో కార్యకర్తలతో సమావేశం

పీసీసీ చీఫ్ షర్మిల ఆదివారం సాయంత్రం 5 గంటలకు జిల్లా కేంద్రానికి చేరుకొనే అవకాశం ఉన్నట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డి తెలిపారు. తర్వాత స్థానిక లలితకళాపరిషత్‌లో కార్యకర్తలతో సమావేశం అవుతారని తెలిపారు. ఈసమావేశానికి సంబంధించి ఏర్పాట్లలో పలువురు కాంగ్రెస్ నాయకులు నిమగ్నం అయ్యారు. శనివారం సాయంత్రం మాజీ పీసీసీ చీఫ్ సాకే శైలజానాథ్ సైతం జిల్లా అధ్యక్షుడితో కలిసి ఎల్‌కేపీలో చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించి, పలు సూచనలు చేశారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న పీసీసీ మాజీ అధ్యక్షుడు శైలజానాథ్

నాట్‌లో పురం విద్యార్థికి ప్రథమ ర్యాంకు

కేంబ్రిడ్జ్ విశ్వ విద్యాలయం నుంచి పిలుపు



విద్యార్థులు ముస్తాఫా, రిధ ఫాతిమతో పాఠశాల ఉపాధ్యాయులు

హిందూపురం అర్బన్, జనవరి 27: జాతీయ స్థాయిలో నిర్వహించిన నేషనల్ అనలిటికల్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌లో (ఎన్ఏటీ) శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం పట్టణానికి చెందిన పాంచజన్య బ్రిలియంట్ పాఠశాల విద్యార్థి ముస్తఫా ప్రథమ ర్యాంకు సాధించారు. పాఠశాల అధ్యక్షుడు శ్రీనివాసులు ఈ విషయాన్ని శనివారం విలేకరులకు తెలిపారు. నేషనల్ ఇండిపెండెంట్ స్కూల్ అలయన్స్ ఇండియా వారు గత నెలలో ఈ పరీక్షలు నిర్వహించారని తెలిపారు. ఈ నెల 25న ఫలితాలు వెలువడ్డాయని, ఈ పరీక్షల్లో పాంచజన్య పాఠశాలకు చెందిన 4వ తరగతి విద్యార్థి ముస్తాఫాకు జాతీయ స్థాయిలో మొదటి బహుమతి వచ్చిందని తెలిపారు. ఇదే పాఠశాలకు చెందిన 3వ తరగతి విద్యార్థిని రిధ ఫాతిమా ఆ తరగతి విభాగంలో జాతీయ స్థాయిలో 2వ ర్యాంకు సాధించారని తెలిపారు. దేశ వ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. నాలుగో తరగతి విద్యార్థుల్లో జాతీయ స్థాయి ప్రథమ స్థానంలో నిలిచిన ముస్తఫాకు ఇంగ్లండ్‌లోని కేంబ్రిడ్జి యూనివర్సిటీ నుంచి ఆహ్వానం లభించిందని తెలిపారు. విమర్శనాత్మక ఆలోచన, సృజనాత్మక ఆలోచన, తార్కిక తార్కికం, సమస్యల పరిష్కారం, బహుళ మేధస్సు అనే అంశాలపై పరీక్షలు నిర్వహించారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి నందకుమార్, పాఠశాల అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ స్మిత, నందిత, హెచ్ఎం గాయిత్రి, ఏఓ భాస్కర్, సూపరింటెండెంట్ విజయేంద్ర, ఏహెచ్ఎంలు శశికళ, సతీష్‌కుమార్, అబ్దుల్ రజాక్ తదితరులు ఉన్నారు.

రేషన్ స్టాక్ పాయింట్ తనిఖీ


స్టాక్ పాయింట్‌లో రికార్డులు పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

ధర్మవరంరూరల్, జనవరి27: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉన్న రేషన్ స్టాక్ పాయింట్‌ను జిల్లా విజిలెన్స్ అధికారి వెంకటరమణ, సీఐ వాసుప్రకాష్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి నిల్వలను, రికార్డులను పరిశీలించారు. రికార్డుల పరంగా స్టాకును పరిశీలిస్తే 98కేజీల బియ్యం తక్కువగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అనంతరం మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా స్టాక్ పాయింట్ల తనిఖీల్లో భాగంగా ధర్మవరంలో ఉన్న స్టాక్ పాయింట్‌ను పరిశీలించామన్నారు. అందులో రికార్డుల్లో ఉన్న మేరకు బియ్యం తక్కువగా ఉండటంతో.. బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు నివేదికలు అందిస్తామన్నారు. రేషన్‌బియ్యంను అక్రమరవాణా చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారి వెంట సిబ్బంది ఉన్నారు.

పుట్టపర్తిలో జిల్లా కోర్టును ఏర్పాటు చేయండి

- హైకోర్టు జడ్జి జస్టిస్ మన్మథరావుకు న్యాయవాదుల వినతి


హైకోర్టు జడ్జిని సన్మానిస్తున్న న్యాయవాదులు

పుట్టపర్తి, జనవరి 27: నూతనంగా ఏర్పడిన శ్రీసత్యసాయిజిల్లాకు సంబంధించి పుట్టపర్తిలో జిల్లా కోర్టు కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ మన్మథరావుకు పుట్టపర్తి బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు విన్నవించారు. సత్యసాయి మహాసమాధి దర్శనార్థం హైకోర్టు జడ్జి ప్రశాంతి నిలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన్ను స్థానిక శాంతిభవన్ అతిథిగృహంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కత్తిగంగిరెడ్డి ఆధ్వర్యంలో న్యాయవాదులు కలిసి మాట్లాడారు. ప్రస్తుతం నూతన జిల్లాలో 32 మండలాలు ఉన్నాయని, కావున జిల్లా కేంద్రంలో జిల్లాకోర్టు కాంప్లెక్సును ఏర్పాటు చేయాలని కోరారు. ఇందుకు అవసరమైన స్థలం, ఇతర మౌలిక సదుపాయాలు ఏర్పాటులో చొరవతీసుకోవాలని అభ్యర్థించారు. అనంతరం వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన్ను పుష్పగుచ్ఛాలు, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో జూనియర్ న్యాయాధికారి రాకేశ్, న్యాయవాదులు కృష్ణమూర్తి, లెక్కల యదుభూషణ్, సతీశ్ రెడ్డి, అతాఫూర్ రహమాన్, ఇందిర, వెంకటరమణప్ప పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి


మృతి చెందిన నారాయణమ్మ

నల్లమాడ, జనవరి 27: మండలంలోని ఎర్రవంకపల్లితండాకు చెందిన వడిత్యా నారాయణమ్మ (45) అనే మహిళ విద్యుదాఘాతంతో మృతి చెందారు. ఘటనపై పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. నారాయణమ్మ శనివారం తన ఇంటివద్ద విద్యుత్ మోటార్ ఆన్ చేసి నీరు పట్టుకుంటున్నారు. అయితే మోటారుకు సంబంధించిన విద్యుత్ వైరు తెగిపోయి కిందపారుగుతన్న నీటిలో పడింది. కాగా ఆ నీటిని ఆమె తాకడంతో షాక్‌కు గురై పడిపోయింది. వెంటనే కుటుంబసభ్యులు 108 వాహనంలో కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలోనే మృతి చెందింది. మృతురాలికి భర్త బాలాజీనాయక్, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమారుడు శ్రవణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ సూర్యనారాయణ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు చెప్పారు.

బకాయిలు చెల్లించాలని వినతి


డీఈఓకు వినతి పత్రం ఇస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

కొత్తచెరువు, జనవరి 27: జిల్లాలో గత ఏడాది జరిగిన పదో తరగతి పరీక్షల స్పాట్ వ్యాల్యూషన్‌కు సంబంధించి టీఏ, డీఏ బకాయిలు వెంటనే చెల్లించాలని ఏపీటీఎఫ్ నాయకులు డీఈఓ మీనాక్షికి శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... గత ఏడాదిలో జరిగిన పదో తరగతి స్పాట్ వ్యాల్యూషన్ పూర్తయి 10నెలలు కావస్తున్నా.. ఇప్పటివరకు టీఏ, డీఏ, రెమ్యునరేషన్ ఇంతవరకు ప్రభుత్వం చెల్లించలేదన్నారు. మరలా పదో తరగతి పరీక్షలే సమీపిస్తున్నాయన్నారు. డీఏ, టీఏలను అందిస్తేనే తాము విధులకు హాజరవుతామన్నారు. లేకపోతే హాజరుకామని పేర్కొన్నారు. అదేవిధంగా మధ్యాహ్న భోజన కార్మికులు, ఆయాలకు జీతాలు ఇప్పటివరకు చెల్లించలేదని, దీంతో వారు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఇప్పటికైన స్పందించిన ఈ సమస్యలు పరిష్కరించాలని వారు కోరారు.

తహసీల్దార్ పనితీరు సరిగా లేదు

- సర్వసభ్య సమావేశంలో జడ్పీ కో ఆప్షన్ సభ్యుడి మండిపాటు

గాండ్లపెంట, జనవరి 27: తహసీల్దార్ పనితీరు సరిగా లేదని జడ్పీ కోఆప్షన్‌సభ్యుడు ఫయాజ్‌అలీ అసహనం వ్యక్తం చేశారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ తాతం జగన్మోహన్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి హాజరయ్యారు. ఇందులో జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మాట్లాడుతూ.. మండలాధికారుల పనితీరు సరిగా లేదని, ముఖ్యంగా తహసీల్దార్ రైతుల భూసమస్యలు పరిష్కరించకుండా నిత్యం కార్యాలయాల చుట్టు తిప్పుకుంటున్నారని మండిపడ్డారు. తహసీల్దార్ తీరుపట్ల రైతులు పలుమార్లు ఆందోళనలు చేపట్టన సంఘటనలు ఉన్నాయన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించని తహసీల్దార్ మాకొద్దంటూ పేర్కొన్నారు. సర్వసభ్య సమావేశానికి తహసీల్దార్ గైర్హాజరయ్యారు. అనంతరం వివిధశాఖల అధికారులు వారి వారి అభివృద్ధి పనులపై వివరించారు. సమావేశంలో ఆయా శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకండి

ప్రొఫెసర్ కృష్ణకిరణ్ వంశీదాసు

ధర్మవరం, జనవరి 27: తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రతి విద్యార్థి బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకోవాలని సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లర్నింగ్ కళాశాల ప్రొఫెసర్ కృష్ణకిరణ్ వంశీదాసు, ఎంఈఓ-2 గోపాల్‌నాయక్, పాఠశాల ఛైర్మన్ శంకర్ నారాయణ సూచించారు. పట్టణంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవపురంలో యశోద కాన్సెప్ట్ పాఠశాల 16వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా వారు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ... ప్రతివిద్యార్థి క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. త్వరలో జరిగే టెన్త్ పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించాలని పిలుపునిచ్చారు. అనంతరం గత ఏడాది పదో తరగతి పరీక్షలలో 10 గ్రేడ్ పాయింట్లు సాధించిన విద్యార్థులకు ముఖ్యఅతిథులు, పాఠశాల డైరెక్టర్లు రవీంద్ర, పృథ్వీరాజ్ జ్ఞాపికతోపాటు రూ.5వేలు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అనూప్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


జ్యోతిప్రజ్వలన చేస్తున్న ప్రొఫెసర్ కృష్ణకిరణ్ వంశీదాస్ తదితరులు

రాజారెడ్డి కాలనీలో దాహం.. దాహం

- వేసవి రాకముందే మొదలైన తాగునీటి ఎద్దడి
- గుక్కెడు నీటి కోసం అల్లాడుతున్న కాలనీవాసులు
- పట్టించుకోని సంబంధిత అధికారులు


మరమ్మతుకు గురైన బోరు


కాలనీలో తాగునీటికోసం వేచి ఉన్న మహిళలు

కదిరిఅర్బన్, జనవరి 27: వేసవి రాకముందే పలు గ్రామాల్లో, కాలనీల్లో తాగునీటి సమస్య నెలకొంటోంది. గుక్కెడు నీటి కోసం ప్రజలు అల్లాడుతున్నారు. అయినా సంబంధితాధికారులు సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టడం లేదు. ముఖ్యంగా మండలంలోని కదిరికుంట్లపల్లి గ్రామం రాజారెడ్డి కాలనీలో ఈ సమస్య తీవ్రంగా ఉంది. అక్కడ గత నెలరోజులుగా నీరు సరఫరా కావడం లేదు. ప్రజలు గుక్కెడు నీటికోసం పడరాని పాట్లు పడుతున్నారు. కాలనీలో తాగునీటి కోసం ఏర్పాటుచేసిన రెండు బోర్లలో ఒకబోరు మరమ్మతుకు గురైంది. మరోబోరులో నీరు అడుగంటి పోయాయి. దీంతో నీటి సమస్య తలెత్తింది. నెలరోజులుగా నీరు సరిగా కావడం లేదని, రెండో బోరులో నీరు అడుగంటడం వల్ల ఎప్పుడో ఒకసారి అరకొరా వస్తాయని కాలనీవాసులు చెబుతున్నారు. వచ్చిన అరకొర నీటిని ట్యాంకుకు వదలుతారని, వాటిని పట్టుకోవడానికి గంటల తరబడి వేచి చూడాల్సిందేనని వాపోతున్నారు. వేసవి రాకనే పరిస్థితి ఇలా ఉందని, ఇక వేసవి వస్తే ఎలా ఉంటోందనని ఆందోళన చెందుతున్నారు. నీటి సరఫరా సక్రమంగా లేదన్న విషయం తెలిసినా అధికారులు చర్యలు తీసుకోకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు



తాగునీటికోసం రోజుల తరబడి ఇబ్బందులు పడుతున్నాం, అధికారులు మాత్రం పట్టించుకోలేదు. తరచూ బోరు మరమ్మతులకు గురవుతున్నా, చర్యలు చేపట్టడం లేదు. దీంతో తమ కాలనీలో తాగునీటి సమస్య తీవ్ర రూపం దాల్చింది. 1 ఈసమస్యను పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లాం. అయితే ఆమె పట్టించుకోవడం లేదు. ఇంక మాసమస్య ఎవరికి చెప్పుకోవాలో అర్థంకావడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలి.

- యుగంధర్, కాలనీవాసి

యర్రాయపల్లిలో భవిష్యత్తుకు గ్యారెంటీ


యర్రాయపల్లిలో భవిష్యత్తుకు గ్యారెంటీలో పాల్గొన్న టీడీపీ శ్రేణులు


రైల్వేగేట్ కొట్టాలలో కరపత్రాలు పంచుతున్న టీడీపీ నాయకులు

బత్తలపల్లి, జనవరి 27: మండలంలోని యర్రాయపల్లి గ్రామంలో శనివారం టీడీపీ శ్రేణులు బాబుష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కరపత్రాలు పంచుతూ టీడీపీ మినీమేనిఫెస్టో పథకాలను ప్రజలకు వివరించారు. తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షుడు చల్లా శ్రీనివాసులు మాట్లాడుతూ చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రంలో అందరికీ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని చెప్పారు. వైసీపీ పాలనంతా అరాచకాలు, అక్రమాలతో సాగిందన్నారు. రాష్ట్రం మళ్లీ అభివృద్ధి పథంలో పయనించాలంటే టీడీపీ అధికారంలోకి రావాలని తెలిపారు. ఇందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్‌నాయుడు, వెంకటేశ్వర్లు, రామలింగప్ప, జయరాం, నూతనప్రసాద్, రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని రైల్వేగేట్ కొట్టాలలో శనివారం టీడీపీ నాయకులు బాబు ష్యూరిటీ -భవిష్యత్తు కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కరపత్రాలు పంచుతూ చంద్రబాబు ప్రకటించిన మినీమేనిఫెస్టో పథకాలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు నందకుమార్, అనీఫ్, ధనుంజయ, దాదావలి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

- గౌనిపల్లి గ్రామ మహిళల డిమాండ్
- ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించి ఆందోళన


ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించిన మహిళలు

ఓబుళదేవరచెరువు, జనవరి 27: తాగునీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని గౌనిపల్లిలో మహిళలు శనివారం స్థానిక రోడ్డుపై ఖాళీబిందెలతో బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. రోడ్డు విస్తరణలో తాగునీటి పైపులైన్లు దెబ్బతిన్నాయన్నారు. దీంతో తాగునీటి సమస్య తీవ్రమైందన్నారు. బోరులో నీరు పుష్కలంగా ఉన్నా.. పైపులైన్ దెబ్బతినడంతో నీటి సరఫరా కావడం లేదన్నారు. చేసేదిలేక ఇతర ప్రాంతాలకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నామని వాపోయారు. ఇలా ఎన్నాళ్లు ఇబ్బంది పడాలని ఆవేదన చెందారు. సమస్య పరిష్కరించేవరకు రాస్తారోకో విరమించమని భీష్మించారు. వాహనాల రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. విషయం తెలుసుకున్న జమేదార్ వెంకటేష్ సంఘటనాస్థలానికి చేరుకుని మహిళలతో మాట్లాడారు. రోడ్డు విస్తరణ సబ్‌కాంట్రాక్టర్లతో మాట్లాడి పదిరోజుల్లో సమస్య పరిష్కరిస్తామని, ఆ లోగా కాంట్రాక్టర్‌తో కానీ, పంచాయతీవారితో కానీ.. ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయిస్తామని హామీ ఇచ్చారు. దీంతో వారు రాస్తారోకో విరమించారు.

వైఎస్ షర్మిల పర్యటనను విజయవంతం చేయండి

కదిరిఅర్బన్, జనవరి 27: పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆదివారం అనంతపురం జిల్లాలో పర్యటించనున్నారని, నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ షాన్వాజ్ పిలుపునిచ్చారు. పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పీసీసీ పదవి చేపట్టిన తరువాత షర్మిల మొదటసారిగా అనంతపురం జిల్లాకు విచ్చేస్తున్నారన్నారు. ఆమె పర్యటనను నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు. తిరుపతి నుంచి కదిరి మీదుగా అనంతపురం వెళ్తున్న ఆమెకు కదిరి జీవిమాను సర్కిల్‌లో సాయంత్రం 4గంటలకు ఘనస్వాగతం పలకనున్నట్లు చెప్పారు. సమావేశంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

అమడగూరు: పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పర్యటనను విజయవంతం చేయాలని దాదిరెడ్డి మధుసూదన్‌రెడ్డి ఓప్రకటనలో పిలుపునిచ్చారు. అనంతపురం లలితకళా పరిషత్‌లో జరిగే సమావేశానికి మండలంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

తాగునీటి సరఫరా బంద్

కదిరిఅర్బన్, జనవరి 27: పట్టణంలో తాగునీటి సరఫరాలో నాలుగురోజుల పాటు అంతరాయం ఏర్పడనున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్ఎస్‌పీ కొట్టాల వద్ద రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా పార్నపల్లి రిజర్వాయర్ నుంచి పట్టణానికి నీరు సరఫరా అయ్యే పైపులైన్‌ను మార్చే పనులు జరుగుతున్నాయని, దీంతో ఆదివారం నుంచి నాలుగురోజుల పాటు నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని తెలిపారు. పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

'ప్రతిఒక్కరిలోనూ మార్పు రావాలి'


భోజనం రుచి చూస్తున్న న్యాయమూర్తులు

కదిరి లీగల్, జనవరి 27: ప్రతి ఒక్కరిలోనూ మార్పు రావాలని, మార్పుతోనే భవిష్యత్తు ఉంటుందని న్యాయాధికారులు ఎస్. జయలక్ష్మి, ఎస్. ప్రతిమ ఖైదీలకు సూచించారు. పట్టణంలోని సబ్‌జైలును శనివారం వారు తనిఖీ చేశారు. మొదట జైలులో ఖైదీలకు ఇస్తున్న కూరగాయలు, నిత్యావసర వస్తువులను పరిశీలించారు. అనంతరం భోజనాన్ని రుచి చూశారు. తర్వాత మాట్లాడుతూ.. పంతాలు, పట్టింపులు, పరాక్రమాలకు వెళ్లి, క్షణికావేశాల్లో తప్పులు చేసి కేసుల్లో ఇరుక్కోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. తప్పులు చేసేవారు భార్యాబిడ్డలకు సమాజంలో ఎదురయ్యే అవమానాలు అర్థం చేసుకోవాలని సూచించారు. ప్రతిఒక్కరిలోనూ మంచిగా మార్పు రావాలన్నారు. లోక్‌అదాలత్‌ను ఖైదీలు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. వారి వెంట న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు లోకేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

కొత్తచెరువు సీఐగా రాజారమేశ్


బాధ్యతలు చేపట్టిన సీఐ

కొత్తచెరువు, జనవరి 27: కొత్తచెరువు పోలీస్ స్టేషన్ సర్కిల్ పోలీస్‌స్టేషన్‌గా అప్‌గ్రేడ్ కావడంతో సీఐగా రాజారమేశ్‌ను ప్రభుత్వం నియమించింది. దీంతో ఆయన శనివారం పదవీ బాధ్యత లు చేపట్టారు. ఆయన పెనుకొండ నుంచి బదిలీపై కొత్తచెరువుకు వచ్చారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

పేరుకే 24 గంటల ఆస్పత్రి

- సాయంత్రమైతే సిబ్బంది మొత్తం ఖాళీ
- ఇదీ గాండ్లపెంట పీహెచ్‌సీ పరిస్థితి



సిబ్బంది లేని ప్రాథమిక వైద్యశాల

గాండ్లపెంట, జనవరి 27: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 24గంటల పాటు సిబ్బంది అందుబాటులో ఉంటారని, అవసరమైన వారికి చికిత్సలు అందిస్తారని ప్రభుత్వం ప్రగల్భాలు పలుకుతోంది. అయితే మండలకేంద్రంలోని పీహెచ్‌సీలో మాత్రం ఆ పరిస్థితి కనపడడం లేదు. సాయంత్రం అయితే చాలు సిబ్బంది అక్కడ అందుబాటులో ఉండడం లేదని స్థానికులు చెబుతున్నారు. సాయంత్రం 4గంటల తరువాత ఎవరూ ఉండడం లేదంటున్నారు. అత్యవసర చికిత్స కోసం ఎవరైనా వస్తే.. ఆస్పత్రిలో ఎవరూ అందుబాటులో ఉండడం లేదు. దీంతో రోగులు ప్రైవేటు వైద్యులను ఆశ్రయించాల్సి వస్తోంది. ఈ ఆస్పత్రిలో ఇంతవరకు ఏ ఒక్క రోగికి సాయంత్రం వేళల్లో చికిత్స అందించిన దాఖలాలు లేవు. ఇక్కడి ప్రజలకు అత్యవసరంగా ప్రమాదాలు చోటు చేసుకుంటే కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాల్సిందే. ఈవిషయంపై డాక్టర్ మారుతీ మహేశ్వరరావును వివరణ కోరగా, స్టాఫ్ నర్సులు ఇద్దరే ఉన్నారని, ఉదయం 9నుంచి, సాయంత్రం 5 గంటల వరకు ఒక నర్సు విధులు నిర్వహిస్తారని తెలిపారు. ఆ తరువాత రాత్రి 8నుంచి మరో నర్సు విధులు నిర్వహిస్తారని చెప్పారు. అత్యవసరమైతే అటెండర్ ఉంటారన్నారు. ఫోన్ చేస్తే సిబ్బంది అందుబాటులోకి వస్తారని చెప్పారు.

'వైసీపీ ఓటమి ఖాయం'

పుట్టపర్తి, జనవరి 27: అవినీతి పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో ఓటమి ఖాయమంటూ జనసేన నాయకుడు, బ్లూమూన్ విద్యాసంస్థల అధినేత శివశంకర్ పేర్కొన్నారు. పట్టణంలో శనివారం జనసేనజిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్లా అధ్యక్షతన ఆయన విలేకరులతో మాట్లాడారు. నవరత్నాలు, బటన్ నొక్కుడుతో సామాన్యులకు ఒరిగింది ఏమీలేదన్నారు. అన్నింటి ధరలు పెంచి ప్రజలపై మోయలేని భారం మోపారన్నారు. టీడీపీ, జనసేన ఉమ్మడిగా ఎన్నికల్లోకి వెళ్లి, విజయం సాధిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం ఆయన్ను స్థానిక నాయకులు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో భైరవప్రసాద్, డాక్టర్ తిరుపేంద్ర, రాము, ఆంజనేయులు, పెద్దన్న, మహేష్, అభి, మారుతి, వెంకటేష్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం

పుట్టపర్తిరూరల్, జనవరి 27: కర్ణాటక రాష్ట్రం నుంచి మద్యం అక్రమ రవాణాపై సెబ్ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో శనివారం ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు మద్యం అక్రమ రవాణాపై దాడులు చేసినట్లు సెబ్ అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని సెబ్ స్టేషన్‌పరిధిలో వాహన తనిఖీలో 2ఎన్డీపీఎల్ కేసులు నమోదు చేసి 300 కర్ణాటక మద్యం ప్యాకెట్లు, ఒక ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే ధర్మవరం సెబ్‌స్టేషన్ పరిధిలో ఒక ఎన్డీపీఎల్ కేసు నమోదు చేసి 14 ప్యాకెట్ల మద్యంను, సీకేపల్లి సెబ్‌స్టేషన్ పరిధిలో ఒక ఎన్డీపీఎల్ కేసు నమోదు చేసి 12 ప్యాకెట్ల మద్యంను, కదిరి సెబ్‌స్టేషన్ పరిధిలో ఒక ఎన్డీపీఎల్ కేసు నమోదు చేసి 10 ప్యాకెట్ల మద్యంను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అలాగే పెనుకొండ సెబ్‌స్టేషన్ పరిధిలో రెండు ఎన్డీపీఎల్ కేసు లు నమోదు చేసి 40 ప్యాకెట్ల మద్యంను, మడకశిర సెబ్‌స్టేషన్‌పరిధిలో రెండు ఎన్డీపీఎల్ కేసులు నమోదు చేసి 53 ప్యాకెట్ల మద్యంను స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ కార్యాలయ అధికారులు ప్రకటనలో పేర్కొన్నారు.

జీతాలు పెంచాలి: ఎస్టీయూ

నంబులపూలకుంట, జనవరి 27: ఉపాధ్యాయ, ఉద్యోగ, పింఛన్లకు 12వ పీఆర్సీ మధ్యంతర భృతిని ప్రకటించాలని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతాభత్యాలను పెంచాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. పీఆర్సీ కమిటీని నియమించి ఆరునెలలవుతున్నా.. ఇప్పటివరకు నివేదికలు ప్రభుత్వానికి సమర్పించలేదన్నారు. పీఆర్సీ కమిటీ నివేదిక ఆలస్యమవుతుండంతో వెంటనే ప్రభుత్వం 30శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే 11 పీఆర్సీని విడుదల చేయాలన్నారు. వివిధరకాల బకాయిలనూ చెల్లించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కదిరిఅర్బన్, జనవరి 27: కదిరి డివిజన్ పరిధిలోని మూర్తిపల్లి సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు విద్యుత్‌అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో కె.బత్తలపల్లి, ముత్యాలచెరువు, కొండమనాయునిపాళ్యం, గొల్లోలచెరువు, వరిగిరెడ్డిపల్లి, ఎస్. కొత్తపల్లి, నల్లగుట్టతండా, కట్టెలతండా, అల్లీపూర్‌తండా, చిగురుమానుతండా, చవిటితండా, పార్థసారధి కాలనీ, వీవర్స్‌కాలనీ, ఆర్డీవో కార్యాలయం, డీఎస్పీ కార్యాలయం తదితర ప్రాంతాల్లో ఉదయం 8నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించాలని కోరారు. వ్యవసాయానికి తెల్లవారుజామున 3 నుంచి ఉదయం 8 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని చెప్పారు.

విద్యుత్ సమస్య పరిష్కారం

ముదిగుబ్బ, జనవరి 27: విద్యుత్ లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలని రెండు రోజుల క్రితం రైతులు, సీపీఐ నాయకులు ధర్నా చేయడంతో.. విద్యుత్ అధికారులు స్పందించారు. మండలంలోని రాళ్లనంతపురం సబ్‌స్టేషన్‌లో శనివారం లోవోల్టేజీ సమస్యను పరిష్కరించే విధంగా విద్యుత్ అధికారులు, సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. నల్లాయకుంటపల్లి, ముక్తాపురం, యాకర్లకుంటపల్లి, నల్లచెర్లోపల్లి తదితర గ్రామాలకు వోల్టేజీ సమస్య లేకుండా సమస్య పరిష్కరించినట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. 48 గంటల్లోనే సమస్యను పరిష్కరించడంతో రైతులు విద్యుత్ అధికారులకు అభినందనలు తెలిపారు.

ఇంటి స్థలాన్ని కబ్జా చేశారు

ధర్మవరం, జనవరి 27: ప్రభుత్వం తనకు మంజూరు చేసిన ఇంటి స్థలాన్ని వైసీపీ నాయకులు దౌర్జన్యంగా కబ్జా చేశారంటూ హైకోర్టు ప్రాక్టీస్ న్యాయవాది శ్రీదేవి శనివారం ఆరోపించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ...తనకు 2020లో పోతులనాగేపల్లి లే అవుట్‌లో ప్లాటు నెంబర్ 63 తో ఇంటి పట్టా మంజూరైందన్నారు. అయితే వైసీపీ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, 108 అంజితో పాటు మరికొందరు వచ్చి తనకు ఇచ్చిన ప్లాటును దౌర్జన్యంగా ఆక్రమించారని ఆమె వాపోయారు. పైగా ఆన్‌లైన్‌లో తన భార్యను ధారాణి పేరిట ఇచ్చారని శ్రీకాంత్‌రెడ్డి పేర్కొంటున్నారన్నారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి పాలనలో ఇలాంటి దౌర్జన్యాలు జరుగుతున్నాయన్నారు తనకు ఉన్నతాధికారులు న్యాయం చేయాలని కోరారు.

బీసీ బాలుర హాస్టల్ తనిఖీ

కొత్తచెరువు, జనవరి 27: మండల కేంద్రంలోని బీసీ బాలురవసతి గృహాన్ని విద్యాశాఖ ఏడీ-3 లాజర్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి విద్యార్థులతో మాట్లాడుతూ ప్రభుత్వం మార్చి 18 వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు నిర్వహించనుందని తెలిపారు. అనంతరం విద్యార్థులకు పరీక్షలకు ఏ విధంగా సన్నద్ధం కావాలి, అధిక మార్కులు ఎలా సాధించాలన్న వాటిపై అవగాహన కల్పించారు. చదువు యొక్క విశిష్ట గురించి తెలియజేశారు.

పారిశుధ్య కార్మిక సంఘం నూతన కమిటీ ఎంపిక

ధర్మవరం, జనవరి 27: ధర్మవరం మున్సిపల్ పారిశుధ్య కార్మికసంఘం నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. స్థానిక పీఆర్టీ వీధిలోని స్త్రీశక్తి భవన ఆవరణలో మున్సిపల్ కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్, సీఐటీయూ మండలకార్యదర్శి అయూబ్‌ఖాన్ ఆధ్వర్యంలో ఈ ఎంపిక జరిగింది. సంఘం గౌరవాధ్యక్షులుగా చెన్నకేశవులు, రామకృష్ణ, రాష్ట్ర వర్కింగ్‌ప్రెసిడెంట్‌గా ప్రసాద్, అధ్యక్షుడిగా బాబు, ఉపాధ్యక్షులుగా పెద్దక్క, ఓబుళప్ప, ప్రధానకార్యదర్శిగా ముకుంద, సహాయకార్యదర్శిగా చంద్రశేఖర్, కోశాధికారిగా లక్ష్మీఓబులేశును ఎంపిక చేశారు. అనంతరం ఇటీవల విధి నిర్వహణలో ఉంటూ అనారోగ్యంతో మృతి చెందిన ఔట్‌సోర్సింగ్ కార్మికుడు గూడూరు బాబు కుటుంబానికి రూ.37,800, మరో కార్మికుడు నాగేంద్రకు రూ.6500లను నగదును అందజేశారు.

సరిహద్దులో ఎస్పీ తనిఖీ



తూముకుంట చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేస్తున్న జిల్లా ఎస్పీ మాధవరెడ్డి

హిందూపురం, జనవరి 27 : ఆంధ్ర సరిహద్దులోని తూముకుంట చెక్‌పోస్టును జిల్లా ఎస్పీ మాధవరెడ్డి శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన అక్కడున్న సెబ్, ఎక్సైజ్ అబ్‌గ్రేడ్ పోలీసులతో మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. అక్రమ మద్యం రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు చేపట్టాల్సిన చర్యలు సూచించారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. 24గంటలు తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ఎస్పీ వెంట డీఎస్పీ, అబ్‌గ్రేడ్ స్టేషన్ సీఐ, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల శ్రమదానం

గోరంట్ల, జనవరి 27: మండలంలోని జీనవాండ్లపల్లిలో ఎస్‌ఏపీఎస్, ఎయిడెడ్ జూనియర్ కళాశాల, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు శనివారం శ్రమదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేక శిబిరంలో భాగంగా గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణంలోని పిచ్చిమొక్కలు తొలగించి, శుభ్రం చేశారు. ఎన్ఎస్ఎస్ పీఓ కళావతి ఆధ్వర్యంలో విద్యార్థులు ఇంటింటికెళ్లి ప్రజలకు అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. అలాగే ఎస్కేడీఆర్ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ పీఓ ఆజాద్ ఆధ్వర్యంలో గుమ్మయ్యగారిపల్లిలో, ఎస్‌పీవీఎం డిగ్రీ కళాశాల పీఓ రఘునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో గోరంట్లలోని రాజీవ్‌కాలనీలో అక్షరాస్యతపై ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపాళ్లు అడవాల సూర్యనారాయణ, విజయలక్ష్మి, భక్తవత్సలం తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ రూరల్ : పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని కోనాపురంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం యూనిట్ కింద శుభ్రతా పనులు చేపట్టినట్లు ఎన్ఎస్ఎస్ పీఓ శంకర్‌నాయక్ తెలిపారు. ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో మూడోరోజు మంగాపురం-కోనాపురం రహదారిలో గుంతలుపడిన రోడ్డుకు మట్టివేయడం, రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు తొలగించడం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో రైతు మృతి



కురుబ పోతన్న (ఫైల్)

పెనుకొండ రూరల్, జనవరి 27 : మండలంలోని అమ్మవారిపల్లి సమీపంలో కొటాక్ కంపెనీ ఎదురుగా శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని కురుబ పోతన్న(78) అనే రైతు మృతిచెందాడు. కియ పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ నజీర్ తెలిపిన వివరాల మేరకు .. మండలంలోని వెంకటగిరిపాళ్యం గ్రామానికి చెందిన కురుబ పోతన్న వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం తన వ్యవసాయ పొలంలో వరిపంటకు నీరుపెట్టి గుట్టూరులో పని నిమిత్తం వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో కొటాక్ కంపెనీ ఎదుట జాతీయ రహదారిపై నడుచుకుంటూ రోడ్డు దాటుతుండగా అనంతపురం వైపు నుంచి పెనుకొండ వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో కురుబ పోతన్న అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ నజీర్ తెలిపారు. విషయం తెలుసుకున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి అల్లుడు శశిభూషణ్, కన్వీనర్ సిద్దయ్య, జావిద్ తదితరులు ప్రభుత్వాసుపత్రికి చేరుకున్నారు. మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రమాదఘటనపై ఆరాతీశారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, జనవరి 27: మండలంలోని వానవోలు గ్రామానికి చెందిన హరీష్ అనే వ్యక్తి విషద్రావకం తాగి శనివారం ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. వానవోలుకు చెందిన రామాంజనేయులు కుమారుడు హరీష్ కుటుంబ కలహాల కారణంగా ఇంట్లో ఉన్న విషద్రావకం తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడినట్లు తెలిసింది. వెంటనే అస్వస్థతకు గురైన అతడిని కుటుంబ సభ్యులు గోరంట్ల ప్రభుతాసుప్రతికి తీసుకెళ్లారు. అక్కడ డాక్టర్ వినోద్‌కుమార్ చికిత్సలు అందించి, మెరుగైన వైద్యం కోసం 108 వాహనం కోసం ప్రయత్నించారు. ఎంతసేపటికీ అది రాకపోవడంతో ప్రైవేటు వాహనంలో హిందూపురం ఆసుపత్రికి తరలించారు.

పేకాట ఆడుతున్న 8 మంది అరెస్ట్

అగళి, జనవరి 27 : మండల పరిధిలోని కసాపురం గ్రామ పొలిమేరలో పేకాడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ లావణ్య తెలిపారు. అందిన సమాచారం మేరకు శనివారం దాడులు నిర్వహించినట్లు తెలిపారు. పేకాడుతున్న ఎనిమిది మందిని అరెస్ట్‌చేసి వారి నుంచి రూ2200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుచనున్నట్లు తెలిపారు.

ద్విచక్రవాహనాల దొంగ అరెస్ట్

హిందూపురం, జనవరి 27 : పార్కింగ్ చేసిన వాహనాలను ఎత్తుకెళ్తున్న ద్విచక్రవాహనాల దొంగను శనివారం అరెస్ట్ చేసి, మూడు వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ శ్రీనివాసులు తెలిపారు. పట్టణంలోని ముక్కడిపేటకు చెందిన మహేంద్ర పట్టణంలో పార్క్‌చేసిన వాహనాలను ఎత్తుకెళ్లేవాడు. పోలీసులు శనివారం మేళాపురం వద్ద ద్విచక్రవాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుబడ్డాడు. దీంతో మహేంద్ర ను అదుపులోకి తీసుకుని విచారించగా... అతడు ఎత్తుకెళ్లిన మూడు ద్విచక్రవాహనాల విషయం తెలిసింది. ఆ మూడు వాహనాలను స్వాధీనం చేసుకుని, అతడిని అరెస్ట్‌చేసినట్లు సీఐ తెలిపారు.

ఆర్బీకేల్లో ఎరువుల కొరత

ఇబ్బందులు పడుతున్న రైతులు



ఎరువులు లేని సి.కొడిగేపల్లి ఆర్బీకే కేంద్రం

మడకశిర రూరల్, జనవరి 27 : రైతు భరోసా కేంద్రాల్లో ఎరువుల కొరత కారణంగా రబీ సీజన్‌లో పంటలు సాగుచేసిన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో 18 రైతు భరోసాకేంద్రాలు ఉన్నాయి. ప్రస్తుతం మండలంలోని రైతులు రబీలో బావులు, బోర్ల కింద రాగి, మల్బరీ, మొక్కజొన్న పంటలు సాగుచేశారు. అయితే ఆయా పంటలు సాగుచేయడానికి అవసర మైన ఎరువులు రైతు భరోసా కేంద్రాలో అందుబాటులో లేవు. దీంతో ఎరువుల కోసం వ్యయప్రయాసల కోర్చి పట్టణానికి వెళ్లి అధిక ధరలతో ప్రైవేటు దుకాణాల్లో ఎరువులను కోనుగోలు చేయాల్సివస్తోందని రైతులు వాపోతున్నారు. పంటల సాగుకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులను రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామని, సబ్సిడీ ధరలతో అందస్తున్నామని ప్రజా ప్రతినిధులు, అధికారులు పదే పదే చెబుతున్నా, అది మాటలకే పరిమితమైందని వాపోతున్నారు. బయట దుకాణాల్లో అధికధరలు వెచ్చించి కొనుగోలు చేయాల్సి వస్తోందని అంటున్నారు. దీనికి తోడు పనులు వదులు కొని ఎరువుల కొనుగోలు కోసం పట్టణాలకు వెళ్లేందుకు సమయం వృథా అవుతోందని అంటున్నారు. దీంతో పాటు రవాణా ఖర్చులు భరించాల్సి వస్తోందని, అధిక శ్రమ తీసుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రబీ సాగు కోసం రైతులకు కావలసిన ఎరువులను ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచాలని రైతులు కోరుతున్నారు.

రైతుల కష్టాలు పట్టించుకోని ప్రభుత్వం



మడకశిర నుంచి యూరియా తెచ్చుకుంటున్న వెంకటరెడ్డి

వైసీపీ ప్రభుత్వం రైతు కష్టాలను పట్టించుకోవడం లేదు. మాటలకే పరిమితమైంది. రైతులకు పంటల సాగు కోసం సబ్సిడీతో విత్తనాలు, ఎరువులు ఆర్బీకేల్లో అందుబాటులో ఉంటాయని అధికారులు అంటున్నారు. అది కేవలం మాటలకే పరిమితం. దీంతో చాలా మంది రైతులు పట్టణాలకు వెళిల ప్రైవేట్ దుకాణాల నుంచి అధిక ధరలతో ఎరువులను తెచ్చుకుంటున్నారు. నేను రెండు ఎకరాల్లో రాగి, మరో రెండు ఎకరాల్లో చెరకు పంటలు సాగు చేశా. స్థానిక ఆర్బీకేలో యూరియా లేదు. దీంతో మడకశిరకు వెళ్లి అధిక ధరలతో కోనుగోలు చేసి, తెచ్చుకున్నా. ఆర్బీకేలో బస్తా యూరియా రూ.266 అయితే ప్రైవేట్ దుకాణాల్లో రూ.310తో కోనుగోలు చేశాను. ఇలా అయితే వైసీపీ ప్రభుత్వం రైతులకు ఎక్కడ సేవలు అందిస్తున్నట్లు.

- వెంకటరెడ్డి, సీ కోడిగేపల్లి

ఆర్బీకేల్లో ఎరువులు అందుబాటులో ఉన్నాయి

మండలంలో దాదాపు అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉన్నా యి. కొన్ని ఆర్బీకేల్లో ఎరువుల కొరత ఉంది. కొరత ఉన్న ఆర్బీకేలకు ఎరువుల కోసం ఇండెంట్ పెట్టాం

- తిమ్మప్ప, ఏఓ, మడకశిర

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

విద్యార్థులకు న్యాయాధికారి శంకర్‌రావు సూచన



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి శంకర్‌రావు

పెనుకొండ, జనవరి 27 : విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి శంకర్‌రావు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో వారం రోజులుగా చెరువు రోడ్డు, గగన్మహల్‌వీధి, తోటగేరివీధి, ప్రత్యేక శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా న్యాయవిజ్ఞాన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ కేశవరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి శంకర్‌రావు, జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి ముజీబ్ పసపల సయ్యద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే యువత నూతన వరవడిని అలవర్చుకోవాలన్నారు. రాజ్యాంగంలోని హక్కులు, విధులు ముఖ్య విషయాలను వివరించారు. ఓటు యొక్క విలువను తెలియజేశారు. వచ్చే ఎన్నికల్లో ఓటు హక్కును ఎలా వినియో గించుకోవాలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు నాగరాజు, ఏజీపీ భాస్కర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్‌ఓ పీఓ రంగనాథ్, కాంతరావు, అధ్యాపకులు చెన్నారెడ్డి, శ్రీదేవి, రామన్న, ప్రతాప్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి మృతికి సంతాపం

గోరంట్ల, జనవరి 27: మండలంలోని గౌనివారిపల్లికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు రంగనాయకులు(60) అనారోగ్యంతో శనివారం మృతిచెందారు. కొన్నిరోజులక్రితం తీవ్ర జ్వరం రావడంతో బెంగుళూరులోని ఎంఎస్ రామయ్య ఆసుపత్రిలో చికిత్సలు పొందారు. అనంతరం ఇంటికి వచ్చిన ఆయన కొన్నిరోజుల తరువాత ఆరోగ్యం దెబ్బతినడంతో, అనంతపురం, కర్నూల్‌ఆసుపత్రిల్లో చికిత్సలు పొందారు. అనంతరం శనివారం సాయంత్రం ఇంటికి చేరుకున్నారు. ఇంటికి చేరుకున్న అరగంటకే మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. బీసీ వర్గానికి చెందిన రంగనాయకులు కొన్నిదశాబ్దాల కాలంగా పార్టీకి సేవలందించారు. ఆయన మృతిపట్ల పలువురు టీడీపీనాయకులు సంతాపం తెలిపారు.

బకాయిలను చెల్లించాలని వినతి

కొత్తచెరువు, జనవరి 27: జిల్లాలో గత ఏడాది జరిగిన పదో తరగతి పరీక్షల స్పాట్ వ్యాల్యూషన్‌కు సంబంధించి టీఏ, డీఏ బకాయిలు వెంటనే చెల్లించాలని ఏపీటీఎఫ్ నాయకులు డీఈఓ మీనాక్షికి శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... గత ఏడాదిలో జరిగిన పదో తరగతి స్పాట్ వ్యాల్యూషన్ పూర్తయి 10నెలలు కావస్తున్నా.. ఇప్పటివరకు టీఏ, డీఏ, రెమ్యునరేషన్ ఇంతవరకు ప్రభుత్వం చెల్లించలేదన్నారు. మరలా పదో తరగతి పరీక్షలే సమీపిస్తున్నాయన్నారు. డీఏ, టీఏలను అందిస్తేనే తాము విధులకు హాజరవుతామన్నారు. లేకపోతే హాజరుకామని పేర్కొన్నారు. అదేవిధంగా మధ్యాహ్న భోజన కార్మికులు, ఆయాలకు జీతాలు ఇప్పటివరకు చెల్లించలేదని, దీంతో వారు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు.

జీతాలు పెంచాలి: ఎస్టీయూ

నంబులపూలకుంట: ఉపాధ్యాయ, ఉద్యోగ, పింఛన్లకు 12వ పీఆర్సీ మధ్యంతర భృతిని ప్రకటించాలని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హరిప్రసాద్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతాభత్యాలను పెంచాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

గుడిబండ, జనవరి 27 : మండలంలోని కొంకల్లు, కురుబరపల్లి, బీటీపల్లి, హిరేతుర్పి గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంజనేయస్వామి విగ్రహానికి అభిషేకం చేసి ప్రత్యేక పూలతో అలంకరించారు. కుంకుమార్చన, ఆకుపూజ, అభిషేకం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో అనేక మంది భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

షర్మిల రాకతో కాంగ్రెస్‌లో నూతనోత్సాహం

మాజీ ఎమ్మెల్యే సుధాకర్

మడకశిర టౌన్, జనవరి 27: దివంగత నేత రాజశేఖర్‌రెడ్డి కుమార్తె వైఎస్ షర్మిల రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించడంతో రాష్ట్రంలో ఏకంగా సమీకరణలు మారుతున్నాయని మాజీ ఎమ్మెల్యే కే సుధాకర్ అన్నారు. పట్టణంలోని నీలకంఠా కోల్డ్ స్టోరేజ్‌లో శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మండల, పంచాయతీ, పట్టణ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం షర్మిల జిల్లా పర్యటనకు వస్తున్నారని, మాజీ మంత్రి రఘువీరారెడ్డి, శైలజానాథ్, గిడిగు రుద్రరాజు తదితరులు హాజరవుతున్నారని అన్నారు. నాయకులు కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండగడుతూ పార్టీ అభ్యున్నతికి సమిష్టిగా కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా మాజీ మార్కెట్‌యార్డు ఛైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, మండల కన్వీనర్ మంజునాథ్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు జాగ్రత్తలు పాటించాలి

జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి అశోక్‌కుమార్



ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి అశోక్‌కుమార్

మడకశిరటౌన్, జనవరి 27: ఆటో డ్రైవర్లు నిబంధనలకు అనుగుణంగా వాహనాలను నడపాలని, తగు జాగ్రత్తలు పాటించాలని మడకశిర జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి అశోక్‌కుమార్ సూచించారు. మడకశిరలోని కోర్టు ఆవరణంలో శనివారం లీగల్ లిటరసీ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ ఆటోడ్రైవర్లు నిబంధనల మేరకు ఆటో నడపాలని సూచించారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్య స్థానాలకు చేర్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు గోపాల్‌రావు, గోపీనాథ్, హనుమంతరాయుడు తదితరులు పాల్గొన్నారు.

జయహో బీసీ సదస్సును జయప్రదం చేయండి : టీడీపీ

రొళ్ల, జనవరి 27: మండల కేంద్రంలో సోమవారం జరిగే జయహో బీసీ సదస్సును జయప్రదం చేయాలని టీడీపీ మండల కన్వీనర్ దాసిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఈరన్న, మడకశిర నియోజకవర్గం ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి పేర్కొన్నారు. ఈ మేరకు వారు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో డీజే సంబరాలతో ర్యాలీ నిర్వహించి స్థానిక లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సదస్సు నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి, మాజీ మంత్రులు పరిటాల సునీత, పల్లె రఘునాథరెడ్డి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబికా లక్ష్మీనారాయణ, టీడీపీ అబ్జర్వర్ పులివెందుల పార్థసారథిరెడ్డి, కార్యదర్శి శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొంటారని తెలిపారు. మండలంలోని బీసీ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

యు.రంగాపురం మహిళల డిమాండ్



తాగునీటి సమస్యపై కార్యాలయ అధికారితో మాట్లాడుతున్న మహిళలు

మడకశిర రూరల్, జనవరి 27 : మండలంలో మెళవాయి పంచాయతీ యూ రంగాపురం గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలంటూ ఆ గ్రామానికి చెందిన మహిళలు ఆందోళన చేపట్టారు. ఈ మేరకు శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ.... నెల రోజులుగా గ్రామంలో తాగునీటి సమస్య ఎదుర్కొంటున్నామని వాపోయారు.. ఈ విషయాన్ని అనేక సార్లు సంబంధిత గ్రామ సచివాలయంలో విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో ఒక్క బోరు మాత్రమే ఉందని తెలిపారు. భూగర్భ జలాలు అడుగంటడంతో అందులోంచి నీరు రావడంలేదన్నారు. దీంతో తాము తాగునీటి కోసం చాలా ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని వారు కోరారు. అలాగే గ్రామంలో సీసీ రోడ్డు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. గడపగడపక కార్యక్రమంలో భాగంగా రంగపురానికి వచ్చిన అధికారులు సీసీ రోడ్డు మంజూరు చేస్తామని అప్పట్లో తెలిపారన్నారు. అయితే ఇప్పటి వరకు పట్టించుకోలేదన్నారు. వెంటనే గ్రామంలో సీసీ రోడ్డు వేయాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. అయితే సమస్య పరిష్కరించేందుకు తాత్కాలికంగా ట్రాక్టర్ ద్వారా తాగునీరు అందిస్తామని సర్పంచు, ఈఓఆర్డీ తెలుపడంతో వారు శాంతించారు. అనంతరం తాగునీటి సమస్య, సీసీ రోడ్డు నిర్మాణానికి సంబంధించిన డిమాండ్లలో కూడిన వినతి పత్రాలను ఎంపీడీఓ ఆరాధ్య, ఈఓఆర్డీ శైలజ, సర్పంచు రంగనాథ్‌కు అందజేశారు.

ట్రాక్టర్ల ద్వారా తాగునీరు అందిస్తాం

యూ రంగాపురంలో ఒక్క బోరు మాత్రమే ఉంది. అందులో నీటిమట్టం తగ్గిపోయి, నీరు రావడంలేదు. దీంతో గ్రామంలో తాగునీటి సమస్య ఏర్పడింది. కొత్త బోరు వేయడానికి పంచాయతీలో తగినన్ని నిధులు లేవు. కావున సమస్య పరిష్కరించేందుకు తాత్కా లికంగా ట్రాక్టర్ ద్వారా తాగునీరు అందిస్తాం. సర్పంచు,ఈఓఆర్డీ పారిపాల అధికారి తెలిపారు.దీంతో వారు శాంతించి వేరుతీరిగి వెళ్ళారు.

- రంగనాథ్, సర్పంచు, మెళవాయి, ఈఓఆర్డీ శైలజ,

టీడీపీ బూత్ కమిటీ కన్వీనర్లకు శిక్షణ



పురంలో శిక్షణకార్యక్రమంలో మాట్లాడుతున్న మనోహర్‌నాయుడు

హిందూపురం, జనవరి 27 : తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం వందశాతం పూర్తిచేయాలని టీడీపీ శిక్షకుడు మనోహర్ నాయుడు అన్నారు. టీడీపీ పరిగిలో మండల కన్వీనర్ లక్ష్మీరెడ్డి ఆధ్వర్యంలో శనివారం బూత్ కన్వీనర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మనోహర్‌నాయుడు మాట్లా డుతూ బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం వందశాతం పూర్తి చేస్తే ప్రతి ఇంటికి టీడీపీ మ్యానిఫెస్టో వెళ్లినట్లన్నారు. ఈ విషయంలో బూత్ కన్వీనర్లు సైనికుల్లా పనిచేయాలన్నారు. ముఖ్యంగా ఓటరు వెరిఫికేషన్ విష యంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. మృతిచెందినవారి పేర్లు కూడా ఓటరు జాబితాలో ఉండటం, డబుల్ ఎంట్రీలపై దృష్టిసారించాలన్నారు. ఈ కార్యక్ర మంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి నరసింహులు, మాజీ సర్పంచ్ ఈశ్వరప్ప, కుమార్, శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్, ఆనంద్, బాలు తదితరులు పాల్గొన్నారు.



గోరంట్లలో మాట్లాడుతున్న మండల కన్వీనర్ సోమశేఖర్

గోరంట్ల: పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మండలంలోని బూత్ కన్వీనర్లకు అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఐటీడీపీ కి చెందిన హిందూపురం పార్లమెంటు ఇన్‌చార్జులు రామాంజనేయులు, పరిమళ, ఎస్పీకుంట గంగశేఖర్ పలు విషయాలపై వివరించారు. ఓటర్లు జాబితా పరిశీలన, బాబుషుర్యాటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం గురించి అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో టీడీపీ కన్వీనర్ సోముశేఖర్, ప్రధాన కార్యదర్శి అశ్వత్థరెడ్డి, వేణుగోపాల్, ఉమ్మర్‌ఖాన్, తిరుపాల్,మనోహర్, కాలనీ శ్రీనివాసులు, మల్లికార్జున తదితరులు, మండలంలోని 75మంది బూత్ కన్వీనర్లు పాల్గొన్నారు.

రొద్దం : మండలంలోని టీడీపీ బూత్ ఇన్‌చార్జ్‌లకు శనివారం ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. మండల పరిధిలోని ఆర్ మరువపల్లిలో ఉన్న బీకే స్వగృహంలో ఇంటిగ్రేటెడ్ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. క్లస్టర్-1, 2, యూనిట్ ఇన్‌చార్జ్‌లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మడకశిర నుంచి వచ్చిన ట్రైనర్ నవీన్ పాల్గొని గ్రామీణ ప్రాంతాల్లో రాబోయే ఎన్నికలకు సన్నద్ధులయ్యేలా శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడు చిన్నప్పయ్య, బీకే సాయికళ్యాణ్, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి నరసింహులు, తెలుగు యువత నాయకులు హరీష్, నరహరి, ఎం కొత్తపల్లి మాజీ సర్పంచ్ నారాయణ, తురకలాపట్నం హరిక్రిష్ణ, రాజప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆలయం అభివృద్ధికి విరాళం



ఆలయ కమిటీ వారికి విరాళం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఈరన్న

మడకశిరటౌన్, జనవరి 27: అమరాపురం గ్రామదేవత అయిన చోళమాంబ ఆలయ అభివృద్ధికి శనివారం మాజీ ఎమ్మెల్యే మద్దనకుంట ఈరన్న రూ.50వేలు ఆర్థికసహాయం చేశారు. త్వరలో జరగనున్న చోళమాంబ ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్నిజాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆ తల్లి ఆశీస్సులతో అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకొంటున్నట్లు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులకు రూ.50వేల విరాళాన్ని అందించారు.

గోరంట్ల: మండలంలోని బూడిదగడ్డపల్లిలో రామాలయ జీర్ణోద్ధరణకు రామలింగారెడ్డి అనే దాత శనివారం రూ.లక్ష విరాళంగా అందించారు. నారసింహపల్లికి చెందిన రామలింగారెడ్డి నగదు రూపంలో ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

'ఇంటి స్థలాన్ని కబ్జా చేశారు'

ధర్మవరం, జనవరి 27: ప్రభుత్వం తనకు మంజూరు చేసిన ఇంటి స్థలాన్ని వైసీపీ నాయకులు దౌర్జన్యంగా కబ్జా చేశారంటూ హైకోర్టు ప్రాక్టీస్ న్యాయవాది శ్రీదేవి శనివారం ఆరోపించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ...తనకు 2020లో పోతులనాగేపల్లి లే అవుట్‌లో ప్లాటు నెంబర్ 63 తో ఇంటిపట్టా మంజూరైందన్నారు. అయితే వైసీపీ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, 108 అంజితో పాటు మరికొందరు వచ్చి తనకు ఇచ్చిన ప్లాటును దౌర్జన్యంగా ఆక్రమించారని ఆమె వాపోయారు. పైగా ఆన్‌లైన్‌లో తన భార్యసుధారాణి పేరిట ఇచ్చారని శ్రీకాంత్‌రెడ్డి పేర్కొంటున్నారన్నారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి పాలనలో ఇలాంటి దౌర్జన్యాలు జరుగుతున్నాయన్నారు తనకు ఉన్నతాధికారులు న్యాయం చేయాలని కోరారు.

నాపైనే దౌర్జన్యంగా కేసులు పెట్టారు

విలేకరుల వద్ద ఓ మహిళ ఆవేదన



విలేకరుల వద్ద వివరిస్తున్న లక్ష్మీదేవి

పావగడ, జనవరి 27: న్యాయం చేయండని పోలీస్‌స్టేషన్‌కు వెళితే పోలీసులు తనపైనే దౌర్జన్యానికి పాల్పడుతున్నారని ఓ మహిళ ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె శనివారం విలేకరుల వద్ద తన గోడు ఇలా వివరించారు. తాలూకా లోని కడపలకెరె గ్రామానికి చెందిన లక్ష్మీదేవి కొన్నేళ్లుగా భర్తతో విడిపోయి పావగడలోనే ఉంటోంది. భర్త స్వగ్రామమైన కలపలకెరలోని ఆ కుటుంబానికి సంబంధించి రెండెకరాల పొలంలో ప్లాంటు వేయడాని ఓ ప్రైవేట్ సోలార్ కంపెనీ వారు ఇటీవల నిర్ణయించారు. ఆమెకు తెలియకుండా ఆమె భర్తతో అగ్రిమెంట్ చేయించుకున్నారు. అందులో తనకు భాగం ఇవ్వకపోతే తాను ఒప్పుకునేది లేదని కంపెనీ వారికి తెలిపింది. దీనిపై ఈ నెల 19వ తేదీన పోలీసులు స్టేషన్‌కు పిలిపించారు. అక్కడికి వచ్చిన డీవైఎస్పీ రామచంద్రప్ప ఆమెపై దాడి చేశారు. రాత్రి 8 గంటల సమయంలో పోలీసులపై ఆమె దాడిచేసినట్లు కేసు నమోదు చేసి, రాత్రికి రాత్రే లేడీ కాని స్టేబుల్‌తో సోలార్ కంపెనీ వాహనంలోనే బెంగళూరు జైలుకు తరలించారు. ఆ మరుసటి రోజు ఆమె పొలం చుట్టూ కంచె వేశారని ఆమె వివరించారు. లక్ష్మీదేవిపై దాడి పట్ల రైతు సంఘం నాయకుడు పూజారప్ప కూడా పోలీసుల తీరుపై తీవ్రంగా మండిపడ్డారు. ఈవిషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికితీసుకెళతామని, సోమవారం పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్నట్లు ఆయన తెలిపారు.